www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 1 | సంచిక: 76 | 30-08-2025 | శనివారం | పేజీలు: 8 | వెల : రూ.5/- |



## రైతులకు శుభవార్త

తీరనున్న యూరియా కష్టాలు
ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి
మంత్రి తుమ్మల వెల్లడి

వివరాలు 2లో

## వారు ఎస్టీలు కాదు




- లంబాడీ, బంజారాలు, సుగాలీని జాబితా నుంచి తొలగించాలని పిటిషన్
- విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు
- కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

04



## 1 నుంచి రేషన్ షాప్‌ల బంద్

ప్రభుత్వానికి రేషన్ డీలర్ల అల్టిమేటం

- కమీషన్ చెల్లించకపోవడంతో రేషన్ డీలర్ల నిర్ణయం
- రేపటి లోగా చెల్లించకపోతే ధర్నాలు
- 4న అసెంబ్లీ ముట్టడిస్తామని ప్రకటన

02

## టీవీ నటుడు లోబోకు ఏడాది జైలు



- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి కేసులో జనగామ కోర్టు తీర్పు

02

- విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి
- ఒకే విభాగం పరిధిలోకి విద్యా శాఖ పరిధిలోని నిర్మాణాలు
- గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు
- ప్రతి విద్యా సంస్థలో క్రీడలకు ప్రాధాన్యం
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి



"పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు."

**హైదరాబాద్, ఆగస్టు 29:** విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహారీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యతప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ (ఈడబ్ల్యూఐడీసీ) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు.

మిగతా 2 లో

## అసెంబ్లీ నిర్వహణకు భద్రత కల్పించండి

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగనుండడంతో అప్రమత్తంగా ఉండండి
- ఆవరణలో నిరసనలు జరుగకుండా చూడండి
- అప్రమత్తంగా ఉండి అడ్డుకోండి
- పోలీసులకు స్పీకర్‌గడ్డం ప్రసాద్



**హైదరాబాద్, ఆగస్టు 29 :** రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఉభయసభలు సజావుగా జరిగేలా పోలీసు డిపార్ట్‌మెంట్‌చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలని సూచించారు. తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయని చెప్పారు. నేటి(శనివారం) నుంచి అసెంబ్లీ సమా వేశాల నేపథ్యంలో సభ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై

మిగతా 2 లో



02

## కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం

అనుమతి కోరుతూ స్పీకర్‌కు బీఆర్ఎస్ వినతిపత్రం



02

## రాష్ట్రాలు బలపడితేనే.. దేశం పటిష్టం

- జీఎస్టీ రేట్ రేషనైలేజేషన్‌తో రెవెన్యూపై ప్రభావం
- జీఎస్టీ నష్టాలకు కేంద్రమే ప్రత్యామ్నాయం చూడాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు రెవెన్యూ తగ్గే ప్రమాదం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం వ్యవహరించాలని అన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో జీఎస్టీ రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు.

## ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం తప్పుదోవ

- ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు

03



## అసెంబ్లీకి స్వతంత్ర ఎమ్మెల్యేగా వెళ్తా

- ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా ఇప్పుడు స్వేచ్ఛ ఎక్కువ
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



03



04

## సుప్రీం జడ్జిలుగా అరాధే, పంచోలీలు

జడ్జిలతో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్

## ఉపరాష్ట్రపతి ఎన్నికలపై బీఆర్ఎస్ అనాసక్తి

- ఎన్నికకు దూరంగా ఉండాలనే యోచనలో పార్టీ?



04

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శనివారం
30 ఆగస్టు 2025



## తీరనున్న యూరియా కష్టాలు

**ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి • వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్ట్ 29:** యూరియా కోసం ఎదురు చూస్తోన్న రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శుభవార్త చెప్పారు. యూరియా సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయని.. ఇందులో భాగంగానే వచ్చే రెండు రోజుల్లో గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లికి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. 2025, సెప్టెంబర్ మొదటి వారంలోగా గంగవరం, దామ్ర, కరాయికల్ పోర్టుల నుంచి మరో 29,700 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని చెప్పారు. పోర్టుల నుంచి ఆదిలాబాద్, జడ్చర్ల, గద్వాల, వరంగల్, మిర్యాలగూడ, పందిళ్లపల్లి, సనత్ నగర్, గజ్వేల్ ప్రాంతాలకు యూరియా చేరుకుంటుందని.. అక్కడి నుంచి డిమాండ్ పరంగా జిల్లాలకు పంపిణీ చేస్తామని తెలిపారు. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. ఈ వర్షానికి రాష్ట్రంలోని చాలా జిల్లాలో తీవ్రంగా పంట దెబ్బతిన్నది. ఈ క్రమంలో శక్రవారం సాయంత్రంలోగా పంట నష్టంపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. బృందాలుగా ఏర్పడి జిల్లాలలో పర్యటించి, పంట నష్టం వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు వరద ప్రభావిత జిల్లా కలెక్టర్లతోమంత్రి తుమ్మల మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేసిందని పేర్కొన్నారు. యూరియా కొరతతో కొంతమంది రాజకీయలు చేశారని మండిపడ్డారు. యూరియాను త్వరలోనే అన్ని జిల్లాలకు సరఫరా చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా సాయంత్రం వరదల పంట నష్టంపై సమావేశం నిర్వహిస్తారని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## 1 నుంచి రేషన్ షాప్‌ల బంద్

**కమీషన్ చెల్లించకపోవడంతో రేషన్ డీలర్ల నిర్ణయం**

**హైదరాబాద్, ఆగస్ట్ 29:** రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్లకు రావలసిన కమిషన్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉచిత బియ్యం పథకాన్ని విజయవంతం చేసినట్లు గొప్పలు చెప్పకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం డీలర్ల కమిషన్ డబ్బులు ఇవ్వడంతో తీవ్ర జాప్యం చేస్తోందని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని రేషన్ షాప్‌ల బంద్ నిర్వహిస్తున్నట్లు, సెప్టెంబర్ 4వ తేదీన అసెంబ్లీ ముట్టడిస్తామని ఆయన గురువారం సివిల్ స్లప్లై భవన్ వద్ద ఆయన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు నెలల నుంచి డి రేషన్ డీలర్లకు కమిషన్ డబ్బులు, రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గన్ని బ్యాగ్స్ డబ్బులు రావడంలేదన్నారు. దీంతో రేషన్ డీలర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆగస్టు 31వ తేదీ వరకు రేషన్ డీలర్లకు కమిషన్ డబ్బులు విడుదల చేయకుంటే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపులు మూసివేసి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు చేస్తామన్నారు. రెండో తేదీన ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా, మూడో తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. చివరకు సెప్టెంబర్ నాల్గొవ తేదీన రాష్ట్రంలోని రేషన్ డీలర్లతో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు, కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వంగరి నాగరాజు, మల్లికార్జున్ గౌడ్, వైకుంఠం, అజిజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాష్ డ్రైవింగ్‌తో ఇద్దరి మృతి

**కేసులో టీవీ నటుడు లోబోకు ఏడాది జైలు**



**జనగామ, ఆగస్ట్29:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతితోపాటు పలువురు గాయపడటానికి కారణమైన టీవీ నటుడు ఖయూమ్ అలియాస్ లోబోకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జనగామ కోర్టు తీర్పునిచ్చింది. జనగామ జిల్లా రఘునాథపల్లి పోలీసుల కథనం ప్రకారం.. 2018 మే 21న ఓ టీవీ ఛానల్ తరపున వీడియో చిత్రీకరణ కోసం లోబో బృందం రామప్ప, లక్నవరం, భద్రకాళి చెరువు, వేయిస్తంభాల ఆలయం తదితర ప్రాంతాల్లో పర్యటించింది. అనంతరం లోబో స్వయంగా కారు నడుపుతూ వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద ఎదురుగా వచ్చిన ఆటోను ఢీకొట్టారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఖిలాషాపురం గ్రామానికి చెందిన మేడె కుమార్, పెంబర్తి మణెమ్మలు తీవ్ర గాయాలతో మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. కారు కూడా బోల్తా పడటంతో లోబోతో పాటు- బృంద సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరి మృతికి కారణమైన లోబోకు ఏడాది జైలు శిక్షతో పాటు- రూ.12,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు- పోలీసులు వివరించారు.

## కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం

**అనుమతి కోరుతూ స్పీకర్‌కు బీఆర్ఎస్ వినతిపత్రం**

**హైదరాబాద్, ఆగస్ట్ 29:** అసెంబ్లీలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. నేటి నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ద్వారా వివరించే అవకాశాన్ని బీఆర్ఎస్ఎల్పీకి కల్పించాలని స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో అసెంబ్లీలో బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎం రమేష్ కుమార్ రెడ్డి ఉన్నారు.

**కాళేశ్వరం నివేదికలో చర్చకురావాలి: బీర్ల ఐలయ్య**

కాళేశ్వరం కమిటి నివేదికను అసెంబ్లీలో పెడతామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. కెసిఆర్ అసెంబ్లీకి రావాలని, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలకు కెసిఆర్ సమాధానం చెప్పుకోవాలన్నారు. కెసిఆర్ సభలో మాట్లాడతానంటే తమ సమయం కూడా ఇస్తామని, బిసి రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలియజేశారు. మంచి పాలన అందిస్తున్నందుకు మమ్మల్ని తిడతారా? అని ఐలయ్య ప్రశ్నించారు.

# విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి

మొదటి పేజీ తరువాయి



మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ నిర్వహణకు భద్రత కల్పించండి

మొదటి పేజీ తరువాయి

తన చాంబర్‌లో శుక్రవారం పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులతో స్పీకర్ ప్రసాద్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ మీటింగ్‌లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్‌వీ నరసింహా చార్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసన సభాపతి మాట్లాడారు. . గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించినట్లుగానే ఇప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు భారీ వర్షాల వల్ల రోడ్లు దెబ్బ తిన్న మార్గాల్లో ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని సభ్యులు సరైన సమయానికి సభకు చేరుకునే విధంగా సహకరించాలన్నారు. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు,



సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలన్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలని, అవసరమైన నోడల్ అధికారులను , లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలన్నారు. ఈ సందర్భంగా సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని సీఎస్ రామకృష్ణారావు చెప్పారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అవసరమైన అధికారులను అందుబాటులో ఉంచుతామని, సభా నిర్వాహణకు ఇబ్బందులు లేకుండా, సజావుగా జరిగేలా ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్‌టెన్షన్ పొందిన చీఫ్ సెక్రటరీ కే రామకృష్ణారావుకు స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జీఏడీ సెక్రటరీ రఘునందన్ రావు, అడిషనల్ సెక్రటరీ (ఫైనాన్స్)- రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్) శివలింగయ్య, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, ఏడీజీ, లా అండ్ఆర్డర్ మహేష్ భగవత్, అడిషనల్ సీపీ (లా అండ్ఆర్డర్) విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

# జీఎస్టీ సవరణల నష్టాన్ని కేంద్రమే భరించాలి

- రాష్ట్రాల ఆదాయం దెబ్బతినకుండా చూడాలి
- జీఎస్టీ కౌన్సిల్ భేటీలో పలు రాష్ట్రాల ఆర్థికమంత్రుల డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 :** కేంద్రం వస్తు సేవల పన్ను జీఎస్టీ రేటు నిర్మాణాన్ని సవరించడంతో ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు శుక్రవారం డిమాండ్ చేశాయి. జీఎస్టీ రేటు నిర్మాణ సవరణ ప్రతిపాదనతో రాష్ట్రాలకు సుమారు రూ.1.5కోట్ల నుండి రూ.2 లక్షల కోట్ల వరకు ఆదాయ నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నాయి. ఎనిమిది రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సెప్టెంబర్ 3, 4 తేదీల్లో జరిగే తదుపరి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తమ ప్రతిపాదనను సమర్పించాలని నిర్ణయించారు. రేటు నిర్మాణ సవరణ, ఆదాయ నష్టాన్ని సమతుల్యం చేయడానికి అల్ట్రా లగ్జరీ, సిగరెట్ వంటి వస్తువులపై ప్రతిపాదిత 40శాతం రేటుతో పాటు అదనపు సుంకాన్ని విధించాలని సూచించాయి. ఈ లెవీ నుండి వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని ప్రతిపక్షపాలిత రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆదాయ భద్రతను లెక్కించడానికి బేస్ ఇయర్‌ను 2024-25గా నిర్ణయించాలని ఎనిమిది రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. ప్రతిపాదిత అదనపు లెవీ విధించిన తర్వాత కూడా లోటు ఉంటే, కేంద్ర ప్రభుత్వం అదనపు లెవీ భవిష్యత్ రసీదులకు బదులుగా సెక్యూరిటీ కల్పించబడిన రుణాలను సేకరించాలని రాష్ట్రాలు తమ ప్ర తిపాదనలో పేర్కొన్నాయి. సమావేశం అనంతరం ఎనిమిది రాష్ట్రాల ఆర్థికమంత్రులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను కాపాడాలని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలకు నష్టం కలిగితే.. ప్రజలు, అభివృద్ధి పనులు ప్రభావితమవుతాయని, రాష్ట్ర స్వయంప్రతిపత్తి కూడా దెబ్బతింటుందన్నారు. ప్రతి రాష్ట్రం ప్రస్తుత జీఎస్టీ ఆదాయంలో 15-20శాతం నష్టపోతున్నట్లు అంచనా వేశామని కర్నాటక ఆర్థికమంత్రి కృష్ణబైరె గౌడ తెలిపారు. 20శాతం ఆదాయనష్టం దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక నిర్మాణాన్ని తీవ్రంగా అస్థిరపరుస్తుందని అన్నారు. ఆదాయం స్థిరీకరించే వరకు రాష్ట్రాలకు ఐదేళ్ల పరిహారం చెల్లించాలని సూచించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చినపుడు ఆదాయ తటస్థ రేటు 14.4శాతం ఉందని, తర్వాత పన్ను రేటు నిర్మాణ సవరణ తర్వాత నికర పన్ను రేటు 11శాతానికి తగ్గింది. జీఎస్టీ రేట్లను తగ్గించడం, స్లాబ్‌లను సవరించడం అనే కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత ప్రతిపాదనతో నికర పన్ను రేటు 10శాతానికి పడిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రేటు నిర్మాణ సవరణకు తాము అంగీకరిస్తున్నామని, అయితే రాష్ట్రాలకు పరిహారం చెల్లించాలని హిమాచల్ ప్రదేశ్ సాంకేతిక విద్యమంత్రి రాజేష్ ధర్మాని పేర్కొన్నారు. రేటు నిర్మాణ సవరణ ప్రయోజనాలు సామాన్యులకు చేరేలా, లాభాలను గుర్తించేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పంజాబ్ ఆర్థికమంత్రి హర్పాల్ సింగ్ చీమ డిమాండ్ చేశారు.

# జీఎస్టీ రేట్ రేషనైలేజేషన్‌తో రెవెన్యూపై ప్రభావం

**రాష్ట్రాలు బలపడితేనే.. దేశం పటిష్టంగా ఉంటుంది**

**జీఎస్టీ నష్టాలకు కేంద్రమే ప్రత్యామ్నాయం చూడాలి**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



న్యూఢిల్లీ, ఆగస్ట్ 29: రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు రెవెన్యూ తగ్గే ప్రమాదం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం వ్యవహరించాలని అన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో జీఎస్టీ రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగేంటేనే.. దేశం బాగుంటుందని తెలియజేశారు. రేషనలైజేషన్‌ను ఆహ్వానిస్తూనే రాష్ట్రాలకు జరిగే నష్టానికి.. పరిహారం చెల్లించే మార్గాలను కేంద్రం ఆలోచించాలని కోరారు. సెప్టెంబర్ 3న మరోసారి ఢిల్లీలో 8 రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తమ డిమాండ్లు లేవనెత్తాలని కేంద్రం నిర్ణయం తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణ రాష్ట్రానికి రూ.7వేల కోట్లు నష్టం వస్తుందని అంచనా ఉన్నట్లు మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దిల్లీలో జరిగిన జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్రాల సమావేశం'లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ తరపున భట్టి విక్రమార్క హాజరుకాగా.. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. జీఎస్టీ సంస్కరణలతో కలిగే నష్టానికి పరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా మంత్రులు డిమాండ్ చేశారు. కొత్త జీఎస్టీ ప్రతిపాదనలతో మొత్తంగా రూ.2లక్షల కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా వేశారు. జీఎస్టీ కౌన్సిల్ భేటీలో తమ ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు.

# ఆర్థిక పరిస్థితిపై తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం

● ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్, ఆగస్ట్ 29:** రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్రం ప్రతినెలా రూ.7,000 కోట్ల రుణ వడ్డీ చెల్లిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అయితే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఈ వాదన తప్పు అని తేల్చిందని స్పష్టం చేశారు. వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమేనని (4 నెలల్లో రూ.9,355 కోట్లు) పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణభారాన్ని ఎక్కువ చేసి చూపిస్తుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే ఈ దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని కెటిఆర్ అన్నారు. ఈ వర్షాల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని, ప్రజలు సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా, విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. రూ.3,50,000 కోట్ల 2036 ఒలింపిక్స్ నిర్వహణ, రూ.1,50,000 కోట్ల మూసీ సుందరీకరణ, రూ. 225 కోట్ల హైదరాబాద్ బీచ్ ప్రాజెక్టుల గురించి చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల గోడును గాలికొదిలేసి, డబ్బు సంపాదించే పనులపైనే రేవంత్ అండ్ కో దృష్టి పెట్టిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గు లేకుండా వ్యవహరిస్తుందని, ఇది ప్రజా పాలన కాదని ట్వీట్ చేశారు. కష్టాలను అధిగమించి మనకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన క్రీడాకారులను మనం గౌరవించుకోవాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ జయంతిని గుర్తు చేసుకుంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు. ఆటలు మనకు సహకారం, పోరాట స్ఫూర్తిని నేర్పిస్తాయని అన్నారు. 'మనం కిందపడితే అది ముఖ్యం కాదు, మళ్లీ ఎలా పైకి లేచామన్నదే ముఖ్యం' అని పేర్కొన్నారు.



# సీఎంను కలిసిన ఓవైసీ బ్రదర్స్

**హైదరాబాద్, ఆగస్ట్ 29 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ,మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు శక్రవారం ఆయన నివాసంలో కలిశారు. మిలాదున్ నబీ సందర్భంగా పురాతన మసీదులు, దర్గాలను అలంకరించాలని, ఉచిత్ విద్యుత్ సరఫరా చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 14న రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలకు అనుమతి ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు.

# సిఎంను కలిసిన సందీప్ రెడ్డి వంగా

పదిలక్షల చెక్కు విరాళంగా అందచేత



**హైదరాబాద్,ఆగస్ట్29 :**టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రూ.10 లక్షల విరాళాన్ని సీఎం సహాయ నిధికి అందించారు. ఈ సందర్భంగా తన సొంత బ్యానర్ భద్రకాళి ప్రొడక్షన్స్ తరపున నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా, సందీప్ రెడ్డి వంగా పదిలక్షల చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్కుని అందించారు సందీప్ రెడ్డి వంగా. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరుపు లేని భారీ వర్షాల కారణంగా ఎంతోమంది నష్టపోయారు. అందువల్ల దర్శకుడు సందీప్ రెడ్డి ఈ సహాయం అందించినట్లు సమాచారం. తెలుగులో అర్జున్ రెడ్డి సినిమాతో ట్రెండ్‌సెట్ చేశాడు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. టాలీవుడ్ లో హిట్ పడగానే బాలీవుడ్ కి మకాం మార్చి అక్కడ కూడా కబీర్ సింగ్, యానిమాల్ సినిమాలతో హిందీ ప్రేక్షకులను ఫిదా చేశాడు. ఈ క్రమంలోనే ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనౌన్స్ చేసి టాక్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ గా మారాడు. స్పిరిట్ విషయానికి వస్తే.. ఇప్పటికే, ఈ మూవీ స్క్రిప్ట్ వర్క్ కూడా కంప్లీట్ చేసుకుంది. త్వరలో షూటింగ్ షురూ కానుంది. ఇందుకు సంబంధించిన సన్నాహాలు చకచకా జరుగుతున్నాయి. ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. త్వరలోనే షూటింగ్ అప్డేట్ వచ్చే అవకాశం ఉంది.

# ఓబుళాపురం కేసులో సుప్రీంలో శ్రీలక్ష్మి పిటిషన్

హైకోర్టు ఆదేశాలపై స్టే విధించిన సుప్రీం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** ఓబుళాపురం అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మి పేరును తొలగిస్తూ గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం కేసులో మరోసారి వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో వాదనల అనంతరం.. ఇటీవల హైకోర్టు తీర్పు వెలువరించింది. శ్రీలక్ష్మి పేరును తొలగించడం కుదరదని, ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ శ్రీలక్ష్మి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

# సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తాం

సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి




**సూర్యాపేట,ఆగస్ట్29:** అసెంబ్లీ సమావేశంలో తమ సమస్యలను లేవనెత్తాలని ప్రజలు బీఆర్ఎస్ తలుపు తడుతున్నారు అని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తెలిపారు. తప్పకుండా ప్రజా సమస్యలను అసెంబ్లీలో లెవనేత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులు భృతి కోసం, నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం, విద్యార్థినులు స్కూటీ– కోసం, రైతులు రుణమాఫీ, రైతు భరోసా, యూరియా, కరెంటు– కోతలపై మమ్మల్ని అడగమని అంటు–న్నారు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరదలపై ప్రభుత్వానికి సోయి లేదు. సీఎం పాత పద్ధతుల్లో రోత మాటలు.. మంత్రులకు రివ్యూ చేయాలనే సోయి లేదు. గోదావరి, కృష్ణాలో వందలాది టీ–ఎంసీల నీరు సముద్రంలో కలుస్తుందని జగదీశ్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఉదయసముద్రంలో నీరు లేదు.. జిల్లా మంత్రి కోమటిరెడ్డికి సోయి లేదు. ఓ వైపు వర్షాలు, మ–రోవైపు యూరియా కోసం రైతులు పడిగాపులు. కాళేశ్వరం నివేదిక అసెంబ్లీలో పెడితే మాకేం ఇబ్బంది లేదు. అసలు నివేదికను బయట పెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక సంస్థల పేరుతో కాంగ్రెస్ మోసం బయట పడింది. మరో డ్రామాకు తెర తీస్తుంది. హైకోర్టు మూడు నెలల –టైమ్ ఇస్తే, రెండు నెలలు నిద్రపోయి, ఇప్పుడు హడావుడి చేస్తుంది. ఎన్నికల కమిషన్ దుర్మార్గంగా వ్యవహరిస్తుంది. ఓ వైపు వర్షాలు, వరదలు వస్తుంటే సమగ్రంగా లేని ఓటర్ లిస్టులు పెట్టి ప్రజల్ని గందరగోళానికి గురి చేస్తున్నారు. అన్ని ఓటర్ లిస్టులను గ్రామాల్లో బహిరంగపర్చాలి. అందరి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి అని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఏసీబీకి చిక్కిన పంచాయితీ కార్యదర్శి



**కరీంనగర్, ఆగస్ట్ 29:** అవినీతి నిరోధక శాఖ అధికారులు ఎన్ని దాడులు చేసినా.. ఎంత మందిని సస్పెండ్ చేస్తున్నా అవినీతి అధికారుల తీరు మారటం లేదు. చిన్న విషయానికి కూడా పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లాలో అలాంటి ఓ లంచగొండి అధికారిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లా ఏసీబీ దాడుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు పంచాయతీ కార్యదర్శి. వీణవంక మండలం చల్లూర్ గ్రామంలో ఇంటి నెంబర్ అలాట్ చేయడానికి ఇరువై వేల రూపాయలు లంచం డిమాండ్ చేశాడు పంచాయతీ కార్యదర్శి నాగరాజు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు బాధితుడు. చెప్పిన టైంలో డబ్బులు ఇవ్వాల్సిందిగా చెప్పిన అధికారులు.. బాధితుడి నుంచి 25 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హండెడ్‌గా పట్టుకున్నారు.

# మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: వివేక్



**హైదరాబాద్,ఆగస్ట్29 :** మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో కార్యకర్తల భేటీలో పాల్గొన్న ఆయన.. మైనార్టీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. అందరికీ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఒక్క సారి హామీ ఇచ్చామంటే తప్పకుండా నెరవేరుస్తామన్నారు. రహమాత్‌నగర్‌లో రూ.20 కోట్ల పనులు మంజూరు చేశామన్నారు. తొందలోనే ఆ పనులు మొదలుపెడతామని చెప్పారు. రహమత్ నగర్ లో ఉన్న శ్మశాన వాటిక సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు మంత్రి వివేక్. ఈ విషయం గురుంచి కలెక్టర్, వక్ఫ్ బోర్డు చైర్మన్ తో మాట్లాడి స్థలం కోసం సర్వే చేయమని ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. తొందరలోనే మీకు మంచి కబారస్థాన్ నిర్మాణం చేస్తామన్నారు. మంచి స్థలం రోడ్డు సమస్య లేకుండా కబారస్థాన్ నిర్మిస్తామన్నారు. మైనార్టీల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందన్నారు.



# అసెంబ్లీకి స్వతంత్ర ఎమ్మెల్యేగా వెళ్తా

ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా ఇప్పుడు స్వేచ్ఛ ఎక్కువ

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్, ఆగస్ట్ 29:** బీజేపీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు తాను స్వతంత్ర ఎమ్మెల్యేగా హాజరవుతానని గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఇండిపెండెంట్ ఎమ్మెల్యేనని ఆయన తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ.. ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా తనకు ఇప్పుడు స్వేచ్ఛ ఎక్కువ ఉందన్నారు. ఒకప్పుడు అసెంబ్లీలో ఏం మాట్లాడాలన్నా పార్టీ అగ్రనాయకత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉండేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే సమయం వరకు సభలో మాట్లాడే అవకాశాన్ని పార్టీ ఇచ్చేది కాదని పేర్కొన్నారు. కానీ సభలో తనకు మాట్లాడే అవకాశం ఇస్తే వివిధ అంశాలు లేవనెత్తుతానన్నారు. తనలాగే బీజేపీలో చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. దీనికి తాజా ఉదాహరణ చేవెళ్ల ఎంపీ వ్యవహారమేనని తెలిపారు. వారిలాగే చాలా మంది పదవులు పోతాయని పార్టీలో జరుగుతున్న ఇబ్బందులపై నోరు విప్పడం లేదన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నా.. వాటిని కొంతమంది సర్వనాశనం చేశారంటూ బీజేపీలోని పలువురు నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటివరకూ ఢిల్లీలోని బీజేపీ నేతల నుంచి తనకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ఒకవేళ వస్తే ఇక్కడ నెలకున్న ఇబ్బందులను వారికి వివరించిన తర్వాతే మళ్లీ ఆ పార్టీలోకి వెళ్తానని స్పష్టం చేశారు. లేకుంటే చచ్చినా.. మళ్లీ ఆ పార్టీలోకి వెళ్లనని ఆయన కరాకండిగా చెప్పారు. ఇక పార్టీలోని పలువురు ఎంపీలు తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక్క ఎమ్మెల్యేను సైతం గెలిపించలేకపోయారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, బీసీ బిల్లులపై అసెంబ్లీ సమావేశాలు అనేది కేవలం ప్రజల నుంచి దృష్టి మరల్చడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల నుంచి ముస్లింలను తీసేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశాన్ని దమ్ముంటే సీబీఐకి అప్పచాలంటూ రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సవాల్ విసిరారు.

# హైదరాబాద్‌లో మరోమారు వర్షం



**హైదరాబాద్,ఆగస్ట్29 :**హైదరాబాద్‌లో మళ్లీ వర్షం దంచికొట్టింది. శుక్రవారం సాయంత్రం పలు చోట్లు భారీ వర్షం కురిసింది. నగరంలోని సికింద్రాబాద్, బేగంపేట్, అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, మణికొండ, కూకట్ పల్లి తదితర ప్రాంతాల్లో వాన పడుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. పలు చోట్ల రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గత మూడు నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వానలకు కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, తదితర జిల్లాలు ఆగమాగమయ్యాయి. వరద ప్రవాహంలో పలు గ్రామాలు, తండాలు నీట మునిగిపోయాయి. దీంతో చాలా మంది నిరాశ్రులయ్యారు.


# 2లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

భారీ వర్షాలపై అధికారులన నివేదికలు

**హైదరాబాద్,ఆగస్ట్29:** తెలంగాణలో భారీ వర్షాల కారణంగా 270 మండలాలు, 2,463 గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. వర్షాలతో వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు– పేర్కొంది. మొత్తం 2,20,443 ఎకరాల్లో పంటలు దెబ్బతినట్లు– ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లాలవారీగా పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు– వెల్లడించారు. నివేదిక ప్రకారం.. 1,09,626 ఎకరాల్లో వరి, 60,080 ఎకరాల్లో పత్తి, 6,751 ఎకరాల్లో సోయాబీన్, 639 ఎకరాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

# పోరాచరం ప్రాజెక్టులో చిక్కుకున్న యువకులు

**మెదక్, ఆగస్ట్ 29 :**మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్‌లోని పోచారం ప్రాజెక్టు వరద ఉద్ధృతితో పోచంరాల్ వద్ద చిక్కుకున్న 8 మంది యువకులను రక్షించేందుకు ఆర్మీ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం లింగంపల్లికి చెందిన యువకులు వినాయకచవితి రోజు విగ్రహాన్ని తీసుకెళ్లేందుకు హవేలీ ఘన్‌పూర్ వచ్చారు. తిరిగివెళ్లే క్రమంలో పోచారం ప్రాజెక్టు వరదతో అక్కడి వంతెన తెగిపోయింది. అవతలి ఒడ్డున చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఆర్మీ సిబ్బంది సహకారంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఆర్మీ సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని రక్షించేందుకు యత్నిస్తున్నారు.



## సంపాదకీయం



# రైతులకు దెబ్బమీద దెబ్బ!

ఇప్పటికే యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడ్డ రైతులపై దెబ్బమీద దెబ్బ అన్నట్లుగా అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీసాయి. పలు జిల్లాల్లో విపరీతమైన భారీ వర్షాలతో పంటలన్నీ నీటమునిగాయి. వేసిన పంటలన్నీ నీటి పాలయ్యాయి. పెట్టుబడులు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయి. అనేక జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉత్తకాది రాష్ట్రాల్లోనూ ఇలాగే ఉంది. వరదలు వచ్చిన ప్రతిసారీ పంటనష్టం సకాలంలో అందడం లేదు. ప్రభుత్వం నష్టం అంచనా వేసి ఇచ్చే అరకొర పరిహారం కూడా ఎప్పుడు అందుతుందో తెలియదు. ఇకపోతే యూరియా సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. దీనిని బట్టి రైతులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారో అర్థం చేసు కోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత మాత్రాన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టడం తగదు. బిజెపి నేతలు కూడా స్థానిక సమస్యపై చర్చించకుండా ఇక్కడి ప్రభుత్వంపైనే నిందలు వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం పలుమార్లు విన్నవించినా పెద్దగా స్పందించలేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించిన ఎరువులు కోటాను పరిశీలిస్తే తెలంగాణపై కొంత పక్షపాతం చూపిస్తున్నట్టుగానే కనిపిస్తోంది. ఈ సంవత్సరం పంటల సేద్యం పెరగవచ్చుననే దృష్టితో రాష్ట్రం 20 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలని కోరితే, రాష్ట్రానికేంద్రం కేటాయించింది 9.80 లక్షల టన్నులు మాత్రమే. ఆగస్టు ఆఖరినాటికి 8.30 లక్షల టన్నులు సరఫరా చేయాల్సిఉండగా ఈనెల ఆఖరికి వచ్చింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. ఆ వివరాలు వ్యవసాయశాఖ మంత్రి పత్రికా ముఖంగా వివరించారు. ఇంకా సుమారు 3 లక్షల టన్నుల లోటు ఉండటం.. సకాలంలో కేంద్రం సరఫరా చేయకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎప్పటికప్పుడు వస్తున్న ఎరువులను మానిటరింగ్ చేస్తూ యూరియాను డిమాండ్ ఉన్న ప్రాంతానికి పంపిస్తున్నామని, రైతులు ఎరువులు దొరకవని ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వంప్రకటించింది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నాయకులు.. పాలకుల వైఫల్యమే అంటూ, ఎరువులు సరఫరా చేయలేని చేతకాని ప్రభుత్వాలంటూ విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. విమర్శలు, మాటలు పక్కకుపెట్టి యుద్ధప్రాతిపదికన ఎరువులు సరఫరా జరిగేలా చూడమని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలు పరిశీలించకుండా రాష్ట్రంలో ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు. రైతులు రాత్రింబవళ్లు సహకార బ్యాంకు గోదాముల వద్ద క్యూలైన్లో ఉంటూ.. పట్టా పాస్ బుక్కులు, చివరికి చెప్పులు కూడా క్యూలైన్లులో పెడుతూ, లైన్ లో ఘర్షణలు పడుతూ, కొన్నిచోట్ల లాఠీచార్జీలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎందుకు ఈ పరిస్థితి వచ్చింది? దీనికి బాధ్యులు ఎవరన్నది ఆలోచించాలి. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటాయి. రాష్ట్రం గత ఏడాది వేసిన పంటలను దృష్టిలో పెట్టుకుని 10 శాతం విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఖరీఫ్ సీజన్ రాకముందే ప్రణాళిక రూపొందించి, 20 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని కేంద్రాన్ని కోరింది. గతంలో ఇచ్చిన 2 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్రం వద్ద నిల్వలు ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఎప్పటికప్పుడు పంపుతున్నామని.. రూ. 80,000 కోట్లు సబ్సిడీ భరించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. యూరియాపై ప్రభుత్వం భరిస్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. చైనా నుంచే 20 శాతం దిగుమతి చేసుకోవాలి. సబ్సిడీని తగ్గించుకొనే ఎత్తులో భాగంగా తక్కువలో తెప్పించుకొనే ప్రయత్నం చేస్తుందని కేంద్రంపై విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా అన్నదాతలకు అగచాట్లు తప్పట్లేదు. ప్రస్తుతం వేసిన పంటలకు 15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది. దాంతో డిమాండు ఎక్కువగా ఉండి.. సరఫరా తక్కువగా ఉండటంతో.. పంపిణీ కేంద్రాల దగ్గర వేకువ జాము నుంచే పడిగాపులు కాస్తున్నప్పటికీ సరుకు కొంతమందికే అందటంతో ఆందోళన మొదలయ్యింది. డిమాండును అడ్డుపెట్టుకొని పలుచోట్ల నల్ల బజారు విక్రయాలు యధేచ్ఛగా రూ.266 బస్తాను రూ. 400 వరకు అమ్ముతున్నారని విమర్శలు వస్తున్నాయి. పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యూరియాను దారి మళ్ళిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అతిగా రసాయన ఎరువుల వినియోగం, పంట మార్పిడి విధానం లేనందున నేలలో మంచి బ్యాక్టీరియా నశిస్తుంది. అతిగా నీరు పెట్టడం, ఎరువులు, రసాయనాలు వాడటం వల్ల భూసారం క్షీణిస్తుంది. రసాయన ఎరువులు, గుమ్మరిస్తే ఫల సాయం రెట్టింపు కాదు. దీనిపై రైతాంగంలో అవగాహన పెంచడంలో ప్రభుత్వాల వైఫల్యం.. మన ఆహార భద్రతనే ప్రమాదంలోనికి నడుతుంది. సాగు భూములను కాపాడుకోవాలంటే ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహిస్తూ, తగినంత పరిణామంలోనే ఎరువులు చల్లేలా అన్నదాతను చైతన్య పరచాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి హెచ్చరించింది. అయితే మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క రైతు అనుకూల నిర్ణయం తీసుకోలేదు. అప్పుడప్పుడూ మద్దతు ధరలు పెంచడం తప్ప చేసిందేమీ లేదు. రైతుల సంఘాల నుంచి వ్యతిరేకతలు, ఆందోళనలు వస్తున్నా చర్చించడం లేదు. సాగుచట్టాలు తీసుకుని వచ్చాక అవి ఎందుకు మంచివో చెప్పలేక పోయింది. వాటిని రద్దుచేస్తున్న సమయంలోనూ ఎందుకు రద్దు చేస్తుందో చెప్పలేదు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా జాతీయ సాగు విధానం తీసుకుని రావవడంలోనూ.. దేశీయంగా పంటలను ప్రోత్సహించడంలోనూ విఫలమయ్యింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ పండించిన పంటలను కొనుగోలు చేసే దిక్కు లేకుండా చేసింది. దేశీయంగా పంటలు పండుతున్నా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో రైతులు పోరుబాట పడుతున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడే విధానాలు రావాలి. అందుకు తగిన కృషి చేయాలి.

# లంబాడీ, బంజారాలు, సుగాలీ ఎస్టీలు కాదు

- వారిని జాబితా నుంచి తొలగించాలని పిటిషన్
- విచారణ చేపట్టిన సుప్రీం.. కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలోనుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కాగా, దీనిపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చటంపై గతంలో తెలంగాణ హైకోర్టులో తెల్లం వెంకట్రావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ తెల్లం వెంకట్రావు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లంబాడీ, సుగాలీ, బంజారాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మెరుగైన స్థానంలో ఉన్నారని పిటీషన్‌లో తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల కోయ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎస్టీ జాబితా నుంచి వారిని తొలగించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరపున సుప్రీం కోర్టులో సీనియర్ అడ్వకేట్ అల్లంకి రమేష్ పిటిషన్ దాఖలు చేశారు. బంజారా, లంబాడాలు, సుగాళీలు గిరిజనులు కారని, 1976 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వచ్చి, అప్పటి నుంచి గిరిజనుల హక్కులను కొల్లగొడుతున్నారని పిటిషనర్లు తమ పిటిషన్ లో పేర్కొన్నారు. వాస్తవానికి మొదట బంజారా, లంబాడా, సుగాళీలు బిసి జాబితాలో ఉన్నారని కోర్టులో వేసిన పిటిషన్ లో తెలిపారు. పిటిషన్ విచారణ జరిపిన సుప్రీంకోర్టు జస్టిస్ జే కే మహేశ్వరి, జస్టిస్ బిష్ణోయ్ ధర్మాసనం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో రిజైండర్ దాఖలు చెయ్యాలని ఆదేశాలు జారీ చేసింది.

# సుప్రీం జడ్జిలుగా జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీలు

### నూతన జడ్జిలతో ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్





**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29:** జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలు సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణస్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ శుక్రవారం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇద్దరు కొత్త జడ్జీల నియామకంతో కోర్టులో పూర్తి స్థాయి జడ్జీల సంఖ్య తిరిగి 34కి చేరుకుంది. 2025 నవంబర్ 23న సిజెఐ బి.ఆర్.గవాయ్ పదవీవిరమణ చేసే వరకు సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ విధులు నిర్వహించనుంది. అయితే జస్టిస్ పంచోలీని సుప్రీంకోర్టుకు ఎంపిక చేస్తూ కొలిజీయం తీసుకున్న నిర్ణయంపై ఆసభ్యుల్లో ఒకరైన జస్టిస్ బి.వి.నాగరత్న భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. భారత హైకోర్టు జడ్జీల సీనియారిటీ– జాబితాలో జస్టిస్ పంచోలి 57వ స్థానంలో ఉన్నారని, ఆయనకంటే సీనియర్లుగా ఉన్న పలువురు ప్రతిభావంతులైన జడ్జీలు ఉన్నారని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. జస్టిస్ పంచోలికి పదోన్నతి కల్పించాలన్న నిర్ణయం జ్యుడీషియల్ నిర్వహణకు ప్రతికూలంగా ఉందని, ఇది సుప్రీంకోర్టు కొలీజియం విశ్వసనీయతను ప్రమాదంలో పడేస్తుందని అన్నారు. 4:1 మెజారిటీ–తో కొలీజియం ఆగస్ట్ 25న జస్టిస్ అరాధేతో పాటు– జస్టిస్ పంచోలిని సిఫారసు చేసింది. సుప్రీంకోర్టుకు వారి నియామకాన్ని 48 గంటల్లోనే, ఆగస్ట్ 27న ప్రకటించారు. జస్టిస్ పంచోలీ 1968, మే 28న అహ్మదాబాద్‌లో జన్మించారు. 2016 జూన్‌లో గుజరాత్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 జులైలో ఆయన పాట్నా హైకోర్టుకు బదిలీ కాగా 2025 జులై 21న పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ అరాధే 1964లో జన్మించారు. 2009 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్ అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011 ఫిబ్రవరిలో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2016లో జమ్మూకాశ్మీర్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2018లో మే నుండి ఆగస్ట్ వరకు మూడు నెలల పాటు– దాని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. జస్టిస్ అరాధే కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2022 అక్టోబర్ వరకు దాని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 జులైలో తెలంగాణ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు అనంతరం 2025 జనవరి 21న బాంబే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల జాబితాలో జస్టిస్ అరాధే మూడవ స్థానంలో ఉన్నారు. జస్టిస్ పంచోలి 19వ స్థానంలో ఉన్నారు.





# జిల్లాలో వరదల్లో కృషి చేసిన సహాయక బృందాలు

### 775 మందిని కాపాడిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ టీమ్‌లు

**నిజామాబాద్, ఆగస్ట్ 29:** భారీ వర్షాలతో పలుచోట్ల చిక్కుకు పోయిన వారిని రెండు ఎన్డీఆర్ఎఫ్, ఆరు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. జిల్లాలో 14 ఆపరేషన్లు నిర్వహించి 775 మందిని కాపాడాయి. రాజంపేట మండల కేంద్రానికి చెందిన ఇప్పకాయల వినయ్‌కుమార్(28) ఇంటి గోడ కూలి మృతిచెందారు. అతను గుండారంపల్లె దవాఖానాలో వైద్యుడిగా పని చేస్తున్నారు. తన ఇంట్లోకి నీళ్లు రావడంతో.. రంధ్రం చేస్తుండగా గోడకూలి పైన పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. బీబీపేట జనగామ గ్రామానికి చెందిన కప్పెర రాజిరెడ్డి(60) బుధవారం సాయంత్రం ఎడ్లకట్టవాగులో గల్లంతయ్యారు. గురువారం ఆయన మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్ బృందం వెలికితీశారు. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామంలోని ఎడ్లకట్ట వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యారు. ఇదే వాగులో కారులో వెళ్తున్న తండ్రీకొడుకులు వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడటానికి ప్రయత్నిస్తుండగా మధ్యలోనే కొట్టుకుపోయారు. కొద్దిదూరం వెళ్లాక చెట్టును పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారు. జిల్లావ్యాప్తంగా 50కి పైగా పశువులు మృత్యువాతపడ్డాయి. కుండపోత వర్షాలతో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. శ్రీరామసాగర్, స్వర్ణ ప్రాజెక్టుల నుంచి ఒకేసారి వరద నీరు దిగువకు వదలటంతో నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీ, ఇందిరానగర్, బోయవాడ, నటరాజ్‌నగర్, భాగ్యనగర్, ప్రియదర్శినీ నగర్, శాంతినగర్ కాలనీల్లోకి భారీగా వరద వచ్చి చేరింది. ప్రధాన వాణిజ్య ప్రాంతమైన శివాజీచౌక్‌లో భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలను పోలీసులు దారిమళ్లించారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికలపై బిఆర్ఎస్ అనాసక్తి

### ఎన్నికకు దూరంగా ఉండాలనే యోచనలో పార్టీ?



**హైదరాబాద్, ఆగస్ట్ 29:** ఉప రాష్ట్రపతి ఎన్నికల సమయం దదగ్గర పడుతున్నా విపక్ష బిఆర్ఎస్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాంగ్రెస్, ఎన్‌డిఎ కూటమిలకు తాము దూరమని ఇప్పటికే కెటిఆర్ ప్రకటించారు. ఈ రెండింటి వల్ల ఒరిగిందేమీ లేదని అంటోంది. దీనిని బట్టి చూస్తుంటే ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉండాల ని బిఆర్ఎస్ పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఎన్నికల్లో పాల్గొనడం వల్ల వచ్చే ఉపయోగం ఏమీ లేదని కెటిఆర్ గట్టిగానే వాదిస్తున్నారు. దీంతో వచ్చే నెల 9న జరుగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నకిలో ఎన్‌డిఎ అభ్య ర్థికి గానీ, విపక్షాల అభ్యర్థికి గానీ ఓటు వేయకుండా తటస్థంగా ఉండాలని పార్ట అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్రానికి సెప్టెంబర్ 9లోపు ఎవరు 2 లక్షల టన్నుల ఎరువులు తీసుకువస్తా రో ఆ పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బిఆర్ ఎస్ మద్దతు ఇస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తేల్చి చెప్పారు. అయితే ఇప్పటివరకు కెటిఆర్ డిమాండ్ పై కాంగ్రెస్ పార్టీ కానీ, బిజెపి పార్టీ స్పందించలేదు. నిజానికి యూరియా సమస్య కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉంటుంది. దీనికి కాంగ్రెస్‌తో పెద్దగా సంబంధం లేదు. అందువల్ల అధికార పార్టీ యూరియా సరఫరా చేస్తే బిజెపికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ రాజీనామాతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు జర గబోతున్నాయి. ఓటింగ్ విషయంలో బిఆర్ఎస్ వ్యూహం ఏంటనే విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికలో పార్లమెంట్ ఉభయ సభల సభ్యులే ఓటర్లు. బిఆర్ఎస్‌ఉకు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీకి రాజ్యసభలో వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు, పార్థసారథి రెడ్డి, కె.ఆర్ సురేష్ రెడ్డిలు ఎంపీలుగా కొనసాగుతున్నారు. వీళ్ల ఎవరికి ఓటే స్తారనేది ఆసక్తికరంగా మారింది. 2022లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమి తరఫున ద్రౌపది ముర్ము, ఇండియా కూటమి తరఫున మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హా పోటీ చేయగా, అప్పుడు తెలంగాణ సిఎంగా ఉన్న కెసిఆర్ ఇండియా కూటమి అభ్యర్థి యశ్వంత్ సి న్హాకు మద్దతు ప్రకటించారు ప్రస్తుతం ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో బిఆర్ఎస్ ఎలాంటి వైఖరిని తీసుకోబో తున్నారన్నది చర్చనీయాంశంగా మారిం ది. బిజెపిలో బిఆర్ఎస్ పార్టీని విలీనం చే సేందుకు ప్రయత్నాలు జరిగాయనే ప్రచా రం ఇటీవల విస్తృతంగా జరిగింది. ఇలాంటి సమయంలో ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ఇస్తే బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అనే అంటూ మరోసారి విలీన ప్రచారం తెర మీదికి వ చ్చే అవకాశం ఉంటుందని, ఒకవేళ విపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇస్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని సపోర్ట్ చేశారన్న ప్రచారం జరుగుతుందని పార్టీ అధి ష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రాధాన్యతల కారణంగా ఎవరికి మద్దతు ఇచ్చినా సమస్య తలెత్తిందని, కాబట్టి ఉపరాష్ట్ర ఎన్నికలో తటస్థంగా ఉండడమే ఉత్తమం అని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కెటిఆర్ కూఆ తన సన్నిహితలు వద్ద ఇలాంటి వ్యాఖ్యలే చేశారని అంటున్నారు. అంతెందుకు బహిరంగంగా కూడా ఆయన ఇవే వ్యాఖ్యలు చేశారు. కాబట్టి ఉపరాష్ట్రపతి ఎన్నికకుదూరంగా ఉండడమే మంచిదనే అభిప్రాయంలో పార్టీ ఉంది.



# కేటీఆర్ బుద్ధి మానుకో?

## లింగన్నపేట వంతెన కేటీఆర్ ఆధ్వర్యంలోనే కూల్చివేశారన్నసంగతి తెలియదా..?

### కేటీఆర్ పై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** కేటీఆర్ నీ బుద్ధి మానుకో అని, లింగన్నపేట వంతెన నీ ఆధ్వర్యంలోనే కూల్చివేశారన్నసంగతి తెలియదా.. అని గంభీరావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు హమీద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి, బీసి అదికార ప్రతినిధి పర్శ హన్మండ్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం జరిగిన నర్మాల సంఘటనలో కేటీఆర్ మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధిక వర్షపాతం ఉండడంతో అప్పర్ మనేరు పొంగిపొర్లి ప్రధాన రహదారులు మూసుకుపోవడంతో ఆ మధ్యలో చిక్కుకున్న ఐదుగురు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఇక్కడి ఎమ్మెల్యేగా గెలుపొందిన కేటీఆర్ ఆలస్యంగా వచ్చి రాజకీయ విషయాలు ప్రస్తావించడం సిగ్గుచేటన్నారు. వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెనువెంటనే స్పందించి హెలిక్యాప్టర్ ద్వారా పారుతున్నవాగు మధ్యలో చిక్కుకున్న ఐదుగురు రైతులను రక్షించి తన కాన్వాయ్ లో సిరిసిల్ల ఆస్పత్రిలో చికిత్స చేయించి వారి స్వగ్రామమైన నర్మాల గ్రామానికి చేర్చి యోగక్షేమాలు తెలుసుకున్నారని తెలిపారు. అలాగే నది ప్రవాహంలో కొట్టుకపోయిన నాగయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారికి కాంగ్రెస్ పార్టీ పూర్తి అండదండగా ఉంటుందని భరోసా కల్పించారన్నారు. అందరూ శోకసముద్రంలో ఉండగా స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ మాత్రం రాజకీయం ప్రస్తావించడం తగదన్నారు. లింగన్నపేట, గంభీరావుపేట మధ్యలో ప్రవహిస్తుందని, నదిపై వంతెన గత ప్రభుత్వం బీఆర్ఎస్ కేటీఆర్ ఆధ్వర్యంలోనే కూల్చివేశారన్న సంగతి తెలియదా అని ఘాటుగా ప్రశ్నించారు. నర్మాల అప్పర్ మానేరు డ్యాంకు మీరు చేసిన ఘన కార్యమేందో తెలుపుతారా అని ఎద్దేవ చేశారు. సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అయి ఉండి ఇంతవరకు మీరు చేసిన అభివృద్ధి శూన్యమని వ్యాఖ్యానించారు. అభివృద్ధి పేరిట గత పదేళ్లుగా రాష్ట్ర ప్రజలను వంచించి మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే కేటీఆర్ కు వచ్చే కమిషన్ లే ముఖ్యమని భావించిన నీచమైన ఆలోచనపరులు కేటీఆర్ అని అన్నారు. ఇకనైనా ప్రజలతో మమేకమై ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని ఇక్కడి అభివృద్ధి కోసం పనిచేయాలని హితవు పలికారు. లేదని మొండిగా ప్రవర్తిస్తే ఈ ప్రాంత వాసులు ఎక్కడికక్కడ అడ్డుకొని కేటీఆర్ ను నిలదీస్తారని, ఎక్కడ తిరుగనివ్వరని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రామచంద్రారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాతూరి అంజీ రెడ్డి, డైరెక్టర్ ఎడబోయిన ప్రభాకర్, రాజనర్సు పార్టీ సోషల్ మీడియా శంకర్, పార్టీ సీనియర్ నాయకులు లచ్చయ్య, బంగ్లా రాజు గౌడ్, ప్రవీణ్, రాజశేఖర్, నర్సయ్య, రామచంద్రారెడ్డి, ప్రసాద్ రావు, మల్లయ్య యాదవ్, ప్రసాద్, మహేష్ ప్రవీణ్, బాబు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం వద్ద పోటెత్తిన గోదావరి

### పుష్కర ఘాట్లపై నుంచి వరద ప్రవాహం

**ఉద్యమ కెరటం, పెద్దపల్లి:** భారీ వర్షాలకు మరోసారి గోదావరిలోకి వరద పోటెత్తింది. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడ వరద మొదటి ప్రమాదకర హెచ్చరిక స్థాయిని దాటింది. కాళేశ్వరంలో జ్ఞాన సరస్వతి, పుష్కర ఘాట్ల మెట్ల పైనుంచి వరద ప్రవహిస్తోంది. గోదావరి పరివాహక సమీప గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మహదేవపూర్ మండలంలో పంట భూముల్లోకి నీరు చేరింది. అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, బలిజాపూర్ గోదావరి పరివాహక ప్రాంతాల్లోని వాగులు ఉప్పొంగడంతో వందల ఎకరాల పత్తి పంట నీట మునిగింది. రెండోసారి పత్తి పంటనష్టంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి 9,71,880 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో 85 గేట్లు ఎత్తి 9,71,880 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

# తహసిల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఇంటిపై ఎసిబి దాడి

### సోదాల్లో భారీగా నడదు, నగలు పట్టుబడినట్లు సమాచారం

**ఉద్యమ కెరటం, వరంగల్:** వరంగల్ జిల్లా ఖిలావరంగల్ తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంటిపై అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులు దాడులు చేశారు. హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఆయన ఇంటిపై వరంగల్ ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. తహసిల్దార్ నాగేశ్వరరావు సొంత జిల్లా ఖమ్మంలో సైతం ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బండి నాగేశ్వర్ రావు గతంలో ధర్మసాగర్, కాజీపేట, హసన్ పర్తి మండలాల్లో తహసిల్దారుగా పనిచేశారు. ఆ సమయంలో ఆయనపై ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టినట్లు తెలిసింది. సోదాల్లో భారీగా నగలు పట్టుబడినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులహారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి మండల కేంద్రంలో గల వెనుకబడిన తరగతుల ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల వసతి గృహాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి సందర్శించారు. వంటశాల, సామాగ్రి నిల్వ చేసే ప్రదేశం, భోజనశాల, విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఉపహారాన్నితీసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మీ భవిష్యత్తు నిర్మాణం మీ చేతుల్లోనే ఉందని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం భీమిని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమానికి హాజరయ్యారు. 15 సంవత్సరాల వయసు పైబడిన నిరక్షరాస్యులైన వారందరికీ చదువు నేర్పించేందుకు వాలంటరీ టీచర్లు కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు 10వ తరగతి పూర్తి చేయని వారిని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా చదివి ఇంటర్మీడియట్ పూర్తి చేసేలాగా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో నవభారత సాక్షరత కార్యక్రమాన్నిసమర్ధవంతంగా నిర్వహించాలని, నిరక్షరాస్యతను పూర్తిగా తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. వయోజనులైన ప్రతిఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగామోహన్, మండల విద్యాధికారి కృష్ణమూర్తి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఏపీఎం బ్రహ్మయ్య, రిసోర్స్ పర్సన్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలోని ఆదివాసి భవన్ లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు కొరత తిరుపతి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వానికి నిదర్శనంగా నిలుస్తాయన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ హాకీలో భారత దేశానికి అనేక పతకాలు సాధించారని అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసి క్రీడాకారులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిడం సకారాం, కోడప పుల్లయ్య, నైత మహేష్, కోరిత సత్యనారాయణ, ఎస్ఆర్పి తొర్రెం బానయ్య, ఆలమ్ మనోహర్, తలండి మోహన్, ఎర్మ నారాయణ, బిబ్బెర రమేష్, పేదమ్ సిద్ధు, ఆత్రం ముఖేష్, సడమేక రమేష్, ఆత్రం అశోక్, క్రీడా కారులు పాల్గొన్నారు.

# లక్ష్మీపూర్ లో కార్డెన్ సర్చ్

**ఉద్యమ కెరటం, సిర్పూర్(టి):** సిర్పూర్(టి) మండలంలోని లక్ష్మీపూర్ గ్రామపంచాయతీలో శుక్రవారం తెల్లవారుజామున సీఐ సంతోష్, ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ రామానుజన ఆదేశానుసారం లక్ష్మీపూర్ గ్రామంలో పోలీస్ కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో వాహనాలకు సరైన పత్రాలు లేని వాటికి జరిమాన విధించినట్లు పేర్కొన్నారు. పది లీటర్ల గుడుంబా, 500 లీటర్ల బెల్లంపానకాన్నిధ్వంసం చేసినట్లు తెలిపారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు తిరిగితే, గంజాయి, మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మానేరులో చిక్కుకున్న వ్యక్తి

### ఓ తల్లి ఆందోళనతో రంగంలోకి దిగిన బృందం

### మొత్తం అయిదుగురిని కాపాడిన సహాయక సిబ్బంది

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒక తల్లి ఆందోళన గుర్తించిన రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. వరదల్లో చిక్కుకున్న తన కుమారుడు జంగం స్వామి కోసం తల్లి లక్ష్మి 30 గంటల పాటు ఎదురుచూసింది. పనుల నిమిత్తం బయటకు వెళ్లిన స్వామి భారీ వర్షాల కారణంగా సుడిగుండం వరద నీటిలో చిక్కుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ తల్లిగుండె.. ఒక్కసారిగా బద్దలైంది. తన కొడుకు తిరిగి వస్తాడో.. రాడో.. అన్న భయంతో ఆవేదన చెందింది. అధికారుల కాళ్ల మీద పడుతూ.. తన కొడుకుని రక్షించాలని వేడుకుంది. అయితే.. స్వామితో పాటు మరో నలుగురు వ్యక్తులు మానేరులో చిక్కుకుపోయారు. దీంతో వారిని రక్షించడానికి రెస్క్యూ బృందం ఎంత ప్రయత్నం చేసిన ప్రతికూల వాతావరణం కారణంగా ప్రయత్నాలు విఫలమయ్యాయి. చూస్తుండగానే.. 30 గంటలు గడిచిపోయాయి. వారు మానేరుపైనే ఉన్నారు. వారు తిరిగి వస్తారా.. అనే సందేహం అందరిలో మొదలయ్యింది. దీంతో ఇదంతా చూస్తున్న తల్లి ఆవేదన కోపం రూపంలో బయటకు వచ్చింది. నాయకులు తన కొడుకును రక్షించలేకపోతే వారు నాయకులుగా ఉండి ఎందుకని మండిపడ్డింది. తన కుమారుడిని రక్షించడానికి మళ్లీ ప్రయత్నించాలని ఆమె అధికారులను కోరింది. దీంతో రెస్క్యూ బృందం కొన్ని గంటలు శ్రమించి.. స్వామితో పాటు– మానేరులో చిక్కుకపోయిన వారిని రక్షించింది. దీంతో ఆ తల్లి 30 గంటల నిరీక్షణకు తెరపడింది. కొడుకు తిరిగి రావడంతో.. తల్లి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇద్దరు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. తనను రక్షించిన రెస్క్యూ బృందంకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇది రెండవ జీవితామని స్వామి పేర్కొన్నారు.



# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దెబ్బతిన్న రోడ్లు, పంటలు, డ్రైనేజీలు, స్కూల్ గోడలు పైకప్పులు, కరెంటు స్తంభాల నష్టాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన సమస్యల సమాచారాన్నిసేకరించి పనులు చేపట్టాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు ఎదురుకాకుండా పనులను శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా జరిగేవిధంగా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ సాధన పోరాట సభను విజయవంతం చేద్దాం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సెప్టెంబర్ 1న నిర్వహించతలపెట్టిన పాత పెన్షన్ సాధన సభ ధర్నాకార్యక్రమానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని టీజీఈజేఏసీ జిల్లా కో చైర్మెన్ అబ్దుల్ ఖమర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బెజ్జూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపర్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హామీ ఇచ్చినప్పటికీ అది నీటి నీటిమూటలుగానే మారిందన్నారు. ఇప్పటికే దేశంలోని ఢిల్లీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, జార□ండ్, పంజాబ్ రాష్ట్రాలు పాత పెన్షన్‌ను తిరిగి అమలు చేస్తున్నాయని అన్నారు. తెలంగాణలో కూడా అదేవిధంగా పాత పెన్షన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ నాయకులు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ గౌరీ శంకర్, సాయిరాం, వైకుంఠం, రాజేశ్వర్, రాజన్న, ధర్మయ్య, తపన్, వసంతరావు, సురేష్ గట్టయ్య, బాబా, వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక
శనివారం
30 ఆగస్టు 2025

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని టీటీడీ కల్యాణ మండపం, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలలో ఘనంగా నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గేడెం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. భారత గొప్ప హాకీ క్రీడాకారుడు మెజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ గేడెం నగేష్, కలెక్టర్ రాజర్షిషా పాల్గొని మెజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ క్రీడా మహోత్సవం లాగిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో క్రీడలకు ప్రోత్సాహం ఇచ్చేదిశగా ముందడుగు వేస్తాయని, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తోడ్పడతాయని అన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకీ జట్లకు ఒలింపిక్స్ లో మూడు బంగారు పతకాలు అందించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటామని, క్రీడాకారులు ఉత్సాహంతో పాల్గొంటారని తెలిపారు. ఈ సంవత్సరం థిమ్ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఏక్ గంటా ఖేల్ కే మైదాన్ మే (ఒక గంట, ఆట స్థలంలో) అనే థీమ్‌పై ఫిట్ ఇండియా ఉద్యమంలా మూడు రోజుల పాటు దేశ వ్యాప్తంగా కొనసాగనుందని, ఈ ఉద్యమం ఆగస్టు 31 వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీవైఎస్ఓ శ్రీనివాస్, పార్థసారథి, అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలుపాలి




జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వార్డుల వారీగా, గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు ప్రచురణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గురువారం ఓటర్లు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురించడం జరిగిందని, ఆ జాబితాలో ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎంపీడీఓ కార్యాలయంలో అభ్యంతరాలను తెలుపాలని సూచించారు. అభ్యంతరాలను స్వీకరించిన ఎంపీడీఓలు పరిశీలించి తగు సవరణలు చేసి తుది జాబితా ప్రచురణ కోసం జిల్లా పంచాయితీ అధికారికి సమర్పించాలని పేర్కొన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ల జాబితా జిల్లా కలెక్టర్ కు ఆమోదం కోసం సమర్పించాలని అన్నారు. వచ్చేనెల 2న ఓటర్లు, పోలింగ్ తుది ముసాయిదా జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో ప్రచురించబడుతుందని తెలిపారు. మండల స్థాయిలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీఓ స్రవంతి, డీపీఓ రమేష్, డీఎల్పీఓ ఫణీంద్ర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీ ఎస్ఓను సస్పెండ్ చేయాలి

**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** కాసిపేట మండలంలోని మోడల్ స్కూల్ అండ్ కాలేజ్ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి ఫ్లస్ ఏఐఎస్బి నాయకులు డిమాండ్ చేశారు శుక్రవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సన్నిగౌడ్ మాట్లాడుతూ కేజీబీవీ ఎస్ఓకు మోడల్ కాలేజ్, హాస్టల్ విద్యార్థుల బాధ్యతలను అప్పగించారని, కానీ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించడం లేదని తెలిపారు. హాస్టల్ కి వచ్చే సరుకులను ముందుగా కేజీబీవీకి తరలించి మిగిలిన వాటిని హాస్టల్ విద్యార్థులకు పంపిస్తున్నారని అన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్ఓ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హాస్టల్లో ఏఎన్ఎం లేరని, వెంటనే ఏఎన్ఎంను కేటాయించాలన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మండల విద్యా శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దబ్బటి అరుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి జతిన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు జుమ్మిడి సుమంత్, నాయకులు అతీఖ్, సాయి తేజ, సంజయ్, సన్ని, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# వినాయకుడికి బోరంచు కుటుంబం పూజలు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మావల మండల కేంద్రంలో ఈశ్వర్ గణేష్ మండలి వారు ప్రతిష్టించిన గణనాథుడికి శుక్రవారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి, ఆయన సోదరులు ప్రశాంత్ రెడ్డి ఇరువురు దంపతులు స్వామి వారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. భారీ గరిక మాలతో స్వామి వారిని అలంకరించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పాటు గణేష్ మండలి నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# పూలాజీ బాబా ఆలయాన్ని సందర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండల కేంద్రంలోని పట్నాపూర్ గ్రామంలో పూలాజీ బాబా పుణ్యతిథి సందర్బంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావ్ ఆలయాన్ని సందర్శించారు. బాబా ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా బాబా తనయుడు ఎంగిలి కేశావు దాదాన, కమిటీ సభ్యులు చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. శనివారం శ్రీ శ్రీ శ్రీ పూలాజీ బాబా 101వ జయంతి వేడుకలు ఉండడంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని చైర్మన్ అధికారులను కోరారు. అదేవిధంగా బాబా దామాజి రోడ్డును సందర్శించి మర్మతులు జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మండల అధికారులు, ఐటీడీఏ అధికారులు, నాయకులు ఆత్రం దత్తు, హైదర్, వసీమ్, సుభాష్ తదితరులు ఉన్నారు.



# పీహెచ్‌సీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం వైద్యరంగ బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల నియంత్రణ దిశగా ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేక ఫీవర్ వార్డులు ఏర్పాటు చేసి జ్వర బాధితులకు వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఆదివాసి కర్మయోగి శిక్షణ శిక్షణ

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆదివాసీ కర్మయోగి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీఓ బీఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రి ఆదేశానుసారం ఈ శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలో పీఎం జూగా కింద ఎంపికైన గ్రామపంచాయతీలోని ఏడు శాఖల అధికారులతో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుందని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బి గౌరీ శంకర్, ఎంఈఓ సునీత, ఐసీడీఎస్ కరుణా రెడ్డి, ఎస్ఈఆర్పీ ఎ నందరామ్, ఎఫ్‌బీఓ ఇ వెంకటేశం, పి బాల ప్రవీణ్ కుమార్, ఏపీఎం ఆర్ మోహన్ దాస్, ఏఈఈ అభిలాష్, శారద, ఏపీఓ రాజన్న, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల పొలం బాట



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామపంచాయతీలో శుక్రవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డీఈ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబాట కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి పంట క్షేత్రాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ ఉపకరణాల్లో వచ్చే సమస్యలు, విద్యుత్ సమస్యలను అధికారులకు తెలుపాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా వ్యవసాయ ఉపకరణాలు ముట్టేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే అడవి జంతువులు, ఇతర జంతువుల నుంచి పంటలను కాపాడేందుకు విద్యుత్ తీగలను అమర్చరాదని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, శిక్ష తప్పదన్నారు. గృహజ్యోతి విద్యుత్ సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. పాత విద్యుత్ బకాయిలను చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. ఆయన వెంట అంజల్ కుమార్, సిద్ధాపూర్ గ్రామస్తులు ఉన్నారు.

# గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ


**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** గ్రామీణ ప్రాంతాల గిరిజన నిరుద్యోగ యువత కోసం స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో డీడీయూ- జేకేవై కింద ఉచిత శిక్షణ, హాస్టల్ వసతితో ఉద్యోగ ఇంటర్వ్యూను నిర్వహించడం జరుగుతుందని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్ (టాలీ) కోసం బీకాం ఉత్తీర్ణులై ఉండాలని, కంప్యూటర్ హార్డ్ వేర్ అసిస్టెంట్ కోసం ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఆటోమొబైల్ టూవీలర్ సర్వీసింగ్ కోసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్, సర్వీస్ కోసం 10వ తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వయసు 15 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారై ఉండాలని, 105 రోజుల పాటు ఆయా కోర్సుల్లో శిక్షణ అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల గిరిజన అభ్యర్థులు సెప్టెంబర్ 1వ తేదీలోగా విద్యార్హత నిజ ధ్రువపత్రాలతో పాటు ఒక జత నకలు ప్రతి, పాస్‌పోర్‌ట సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్పూర్ గ్రామంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

# గల్లంతైన వ్యక్తి కోసం ప్రత్యేక సెర్చింగ్

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య బుధవారం గల్లంతయ్యాడు. ఆయన ఆచూకీ కోసం రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, నీటి పారుదల, మత్స్య శాఖ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎగువ మానేరు ప్రవహించే మండలాల్లోని చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు, కల్వర్టులు ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. నర్మాల నుంచి గంభీరావుపేట వరకు, గంభీరావుపేట నుంచి మల్లారెడ్డిపేట వరకు, మల్లారెడ్డిపేట నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు, వెంకటాపూర్ నుంచి సిరిసిల్ల వరకు, సిరిసిల్ల నుంచి మధ్య మానేరు రిజర్వాయర్ వరకు వెతకాలని సూచించారు. ఒక్కో ప్రాంతానికి ఐదుగురితో కలిపి ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ సభ్యులు వెంటనే తమ విధి నిర్వహణను మొదలు పెట్టాలని ఆదేశించారు.

# ఘనంగా కుంకుమ పూజలు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మంచిర్యాలలో గల వంద ఫీట్ల రోడ్డు వద్ద అంజనీపుత్ర సంస్థ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు తరలివచ్చారు. లంబోధరుని వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గణనాథుని వద్ద మహిళలు కోలాటాలు ఆడారు. ఈ సందర్భంగా అంజనీపుత్ర సంస్థ చైర్మెన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు వినాయక చవితి పండగ అద్దం పడుతుందని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు ప్రేమను రాగాలతో కలిసి జరుపుకునే పండగ వినాయక చవితి అన్నారు. అనంతరం మహిళామణులతో 3వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం, సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.





## జుగా పై అధికారులకు శిక్షణ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ (రెబ్బెన) :** గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ప్రధానమంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్స్ అభియాన్ పథకం ద్వారా గిరిజనులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించడం జరుగుతుందని ఏసీ ఆర్పి రాథోడ్ రవీందర్ తెలిపారు. శుక్రవారం రెబ్బెన మండలం లో అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో శంకరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ , ఏసీ ఆర్ పి మాట్లాడుతూ గ్రామస్తాయి ఆది కర్మ యోగి అభియాన్ శిక్షణ కార్యక్రమం పీఎం జన్ మన్ పీఎం జూగా కార్యక్రమం లో భాగంగా గ్రామస్థుల సమస్యల పైన సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులు కలిసి చర్చించి తీర్మాణాలు చేసి , కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ధర్తి అభా భగవాన్ బిర్స ముండా గారి స్పూర్తితో కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లోని గిరిజన, అదిమ గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కోసం ఈ పథకాలు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ పథకం క్రింద ఎంపికైన హాబిటేషన్లలలో మౌలిక వసతులు, సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ వెంకటేశ్వర, మిషిన్ భగీరథ ఏఈఈ జి. వికాస్. ఎఫ్ ఆర్ ఓ భానేష్ , ఐసిడిఎస్ సూపర్ వైజర్ జామున, పంచాయతీ సెక్రటరీ ప్రేమలత , సిహెచ్ఓ జగదీష్, ఉపాధ్యాయులు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కుంకుమ పూజలు



**ఉద్యమ కెరటం, రెబ్బెన :** రెబ్బెన మండలంలోని ఖైర్గాం గ్రామంలోని శ్రీ ఆంజనేయ యూత్ గణేష్ మండలి వద్ద శుక్రవారం అర్చకులు సాయి ఆధ్వర్యంలో మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శివాలయంలో కుంకుమ పూజలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మంచిర్యాల జిల్లా తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం కుంకుమ పూజను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని గణపతికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఎలుక రామచందర్ దంపతులు, పూజారి కిషోర్ పంతులు పాల్గొని భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

## గ్రామపంచాయతీల తనిఖీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** గోపాల్‌నగర్, రేచిని గ్రామ పంచాయతీలను తాండూర్ మండల పంచాయతీ అధికారి జి అనిల్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్లు, మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. పంచాయతీల్లో జరుగుతున్నపారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామపంచాయతీ నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేరు చేయాలని, తడి చెత్తతో ఎరువు తయారు చేయాలని, పొడి చెత్తను రీసైక్లింగ్ యూనిట్‌కు పంపేవిధంగా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట గోపాల్ నగర్ ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్, రేచిని గ్రామపంచాయతీ కార్యదర్శి పి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## బీజేపీ జిల్లా కార్యదర్శిగా మహిధర్



**ఉద్యమ కెరటం, తాండూర్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావు ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్ గౌడ్ జిల్లా కార్యదర్శులను నియమించారు. బీజేపీ జిల్లా కార్యదర్శిగా తాండూర్ మండలం మాదారం టౌన్షిప్ కు చెందిన రామగౌని మహిధర్ గౌడ్ కు చోటు కల్పించారు. ఈ సందర్భంగా రామగౌని మహిధర్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా తనకు బాధ్యత ఇచ్చినందుకు రాష్ట్ర, జిల్లా పార్టీకి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతకి న్యాయం చేస్తూ పార్టీ ఇచ్చిన విశ్వాసాన్ని గౌరవిస్తూ పార్టీ అభివృద్ధి కోసం తన శక్తి మేర కృషి చేస్తానని పేర్కొన్నారు. తనతో పాటు జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.

# భారీ వర్షం నష్టాలపై నివేదిక సమర్పించాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** భారీ వర్షాల కారణంగా కలిగిన నష్టాలపై పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి జిల్లాలో భారీ వర్షాల వలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూలై, ఆగస్టు నెలలలో కురిసిన భారీ వర్షాల కారణంగా పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల పరిధిలోని రహదారులు వరదనీటి తాకిడికి కోతకు గురయ్యాయని, కల్వర్టులు తెగిపోయినందున వాటి నష్టాల నివేదికను అందించాలని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల కాలువలు గండ్లు పడ్డాయని, భారీ వర్షాల వలన ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో 15 వేల ఎకరాలలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని, విద్యుత్ శాఖ పరిధిలో స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపోవడం, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోవడం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చనిపోయిన పశువులు, మేకలు, గొర్రెల ఫోటోలతో కూడిన వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. ఇంకా ఇతర శాఖలలో జరిగిన నష్టాలను నివేదిక రూపంలో అందించినట్లయితే బాధితులకు పరిహారం అందించేందుకు నిధుల మంజూరు కొరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపండి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** స్థానిక సంస్థల ఓటర్ల ముసాయిదా జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 తేదీలోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల ఓటర్ల జాబితా అభ్యంతరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ల జాబితాను ఇప్పటికే సిద్ధం చేయడం జరిగిందని, ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 28వ తేదీన అన్ని గ్రామపంచాయతీలలో, మండల కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 30వ తేదీన అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితాలోని పేర్లు, పోలింగ్ కేంద్రాల పై అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందని, ఈ నెల 31 వ తేదీన అభ్యంతరాలను పరిష్కరించి సెప్టెంబర్ 2 వ తేదీన తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గ్రామీణ ఓటర్లు 3 లక్షల 53 వేల 904 మంది ఉన్నారని, 335 గ్రామపంచాయతీలు, 2 వేల 874 వార్డులు ఉన్నాయని తెలిపారు. స్థానిక సంస్థలలో అర్హత గల ఓటర్లు తమ ఓటు అవకాశాన్ని వినియోగించుకునే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మి నారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోట్నాక భీమ్ రావు సేవలు చిరస్మరణీయం



### జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేసిన స్వర్గీయ కోట్నాక భీమ్ రావు సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పిల్లల పార్క్ లోని కొట్నాక భీమ్ రావు విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన 23వ వర్ధంతి కార్యక్రమానికి జిల్లా ఎస్. పి. కాంతిలాల్ సుభాష్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జెడ్పిటిసి అరిగేలా నాగేశ్వర్ రావు , సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్ , మాజీ సర్పంచ్ సరస్వతి, గిరిజన సంఘాల నాయకులతో కలిసి హాజరై భీమ్ రావు విగ్రహానికి పూజలు నిర్వహించి, పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా కోట్నాక భీమ్ రావు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నేటి గిరిజన యువత భీమ్ రావు ను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసే ఆసిఫాబాద్ పేరును రాష్ట్రస్థాయిలో నిలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వివిధ సంఘాల నాయకులు , బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కోట్నాక భీమ్ రావు కు ఆర్ ఎస్ పీ ఘన నివాళి

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కోట్నాక భీమ్ రావు వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి భారత రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



# జాతీయ క్రీడారంగంలో ధ్యాన్ చంద్ సేవలు వెలకట్టలేనివి



### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జాతీయ క్రీడారంగంలో హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం ధ్యాన్ చంద్ జయంతి పురస్కరించుకుని జిల్లా క్రీడా యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరం ఏర్పాటు చేసిన జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి హాజరై ధ్యాన్ చంద్ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి, చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశం గర్వించదగిన క్రీడాకారుడిగా, హాకీ క్రీడా మాంత్రికుడిగా పేరు తెచ్చుకున్న ధ్యాన్ చంద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎంతోమంది క్రీడాకారులకు స్పూర్తిగా క్రీడా రంగం వైపు అడుగులు వేసేలా మార్గదర్శకుడిగా నిలిచాడని అన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జ్ జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి రమాదేవి, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



# వివాహిత అదృశ్యం వివాదాస్పదం

## రెబ్బెన పోలీసులకు కలెక్టర్ సీసీపై భర్త ఫిర్యాదు


పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుడి ఆరోపణ

ఇద్దరు పిల్లలను తల్లిగారింట్లో వదిలివెళ్లడంపై అనుమానాలు

అదృశ్యమైన సమయంలో వారి వద్ద రూ.50 లక్షలు ఉన్నాయట?!

ఆచూకీ కనుక్కోవాలని కలెక్టర్, ఎస్పీని విన్నవించిన భర్త

తన పిల్లలకు తల్లి ప్రేమను అందించాలని వేడుకోలు



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన 32 ఏండ్ల ఓ వివాహిత అదృశ్యం వివాదాస్పదంగా మారింది. పండుగ కోసం తల్లి గారింటికి వెళ్లిన తన భార్య.. పిల్లలను వదిలి కలెక్టర్‌సీసీతో వెళ్లిపోయినట్టు భర్త ఫిర్యాదు సమయంలో పోలీసులకు తెలుపడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా వారు అదృశ్యమైన సమయంలో రూ.50లక్షలు ఉన్నాయని, ఆ డబ్బులు ఉన్నతాధికారికి చెందినదిగా ప్రచారం జరుగుతుండటం పలు అనుమానాలకు తావిస్తున్నది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఎఫ్ఐఆర్‌లో 'నో అక్యూస్డ్' అని పేర్కొనడంలో మర్మమేమిటో అర్థం కావడం లేదని ఇటు కలెక్టరేట్ ఉద్యోగుల్లో, అటు స్థానికుల్లో అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

- ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ జిల్లా ప్రతిధి

### రూ.50 లక్షలు ఎక్కడివి?!



వివాహిత అదృశ్యం కేసులో మరో ట్విస్ట్ ఏంటంటే.. వీరు అదృశ్యమైన సమయంలో వారి వద్ద దాదాపు రూ.50 లక్షలు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. కాగా, చిరు ఉద్యోగులుగా పని చేస్తున్న వీరి వద్ద దాదాపు రూ.50 లక్షలు ఉండడం పట్ల పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ డబ్బు ఓ ఉన్నతాధికారిదని, అందుకోసమే ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తుంది..? అసలు ఈ రూ.50 లక్షలు ఎవరివి అని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు. మహిళను తీసుకెళ్లిన విషయంపై, మహిళా అదృశ్యం కేసు నమోదు చేసుకొని పోలీసులు చేతులు దులుపుకున్నరని విమర్శలు వినిపిస్తున్నాయి.

### అసలేం జరిగిందంటే..

ఆసిఫాబాద్ లోని గురుకుల పాఠశాలలో టీచర్‌గా పని చేసే రమేశ్- సఖి సెంటర్‌లో సీవోగా పని చేసే మమత దంపతులకు కూతురు(13), కొడుకు(7) ఉన్నారు. భార్యను ఏదైనా ఉన్నత స్థానంలో చూడాలని భర్త ఆమెను బాగా చదివించగా, రెండేండ్ల క్రితం ఆమె సఖి సెంటర్‌లో సీవోగా చేరింది. వీరి జీవితం అన్యోన్యంగా సాగుతున్నది. ఈ నెల 24న బడుగ పండుగ సందర్భంగా భార్య, పిల్లలను తన అత్తగారిల్లు అయిన రెబ్బెనలో రమేశ్‌విడిచిపెట్టి ఆసిఫాబాద్‌కు వచ్చేశాడు. మరుసటి రోజు రమేశ్‌కు అత్త ఫోన్‌చేసి, తన కూతురు కనబడటం లేదని చెప్పింది. ఆమె కోసం బంధువుల ఇండ్లు, తెలిసిన వారి ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించకపోడంతో రమేశ్26న రెబ్బెన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు సమయంలో మౌఖికంగా పోలీసులకు కలెక్టర్‌సీసీ పేరుతో పాటు పలు విషయాలు చెప్పినట్టు రమేశ్‌పేర్కొన్నాడు.

### కలెక్టర్ సీసీనే తీసుకెళ్లాడు..!

జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్ సీఓగా పని చేస్తున్న తన భార్యకు కలెక్టర్ సీసీగా పని చేస్తున్న వ్యక్తి తీసుకెళ్లాడని రమేశ్‌ఆరోపిస్తున్నాడు. ఈ మేరకు శుక్రవారం ఓ వీడియో కూడా విడుదల చేశాడు. తాను రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బేఖాతర్ చేసినట్లు వాపోయాడు. తన భార్య అదృశ్యంపై వివరాల పోలీసులను సంప్రదిస్తే, దాటవేస్తున్నారని వాపోయాడు. కలెక్టర్‌సీసీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రాంతంలో కలెక్టరేట్‌కు వచ్చి వెళ్లారని, కానీ మిస్సింగ్ ఉన్న తన భార్య గురించి అక్కడి అధికారులను అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని వాపోయాడు. తమకు ఇద్దరు చిన్న పిల్లలున్నారని, న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. లేనిపక్షంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు. పోలీసుల ద్వంద నీతి వలన న్యాయం జరగదని కంటతడి పెట్టాడు. తన కుటుంబం ఛిన్నాభిన్నమైందని రోదిస్తున్నాడు. పోలీసులకు సీసీ పేరు చెప్పినా ఎఫ్ఐఆర్‌లో పెట్టకపోవడం దారుణమన్నాడు.

### కలెక్టర్, ఎస్పీకి వేడుకోలు

తన భార్యకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లిన కేసును పక్కదారి పట్టిస్తున్న వారిపై పూర్తి విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కలెక్టర్, ఎస్పీని కోరినట్లు రమేశ్ తెలిపాడు. చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తన భార్య అదృశ్యంపై సఖి సెంటర్ నిర్వాహకులు సైతం నిర్లక్ష్యం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశాడు. కౌన్సెలింగ్‌నిర్వహించి కుటుంబాలను కలిపే సఖి సెంటర్ నిర్వాహకులు సైతం ఏమి జరగనట్లు వ్యవహరించడంపై ఏ అదృశ్య శక్తులు పనిచేస్తున్నాయో తెలుపాలని డిమాండ్ చేశారు. మహిళా అదృశ్యం కేసులో పోలీసులు ఈ విధంగా ప్రవర్తించడంపై ఉన్నతాధికారులు కలుగజేసుకొని కేసును పక్కదారి పట్టిస్తున్న వారిపై విచారణ జరపాలని కోరారు.



# సూపరింటెండెంట్ నిర్లక్ష్యపు నీడలో ప్రభుత్వ ఆసుపత్రి!






## పేరుకే పెద్ద ఆసుపత్రి

ప్రాథమిక చికిత్సకే పరిమితం!

ఆసుపత్రి నిర్వహణ అధ్వానం!

**ఉద్యమ కెరటం, అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** గిరిజనుల పేరిట ఏర్పాటు చేసిన జిల్లాలో గిరిజన రోగుల, పేదల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న వైద్యులు, సిబ్బంది. దీనికి నిలువెత్తు సాక్ష్యంగా గురువారం రోజున ఆసిఫాబాద్ మండలంలోని బలాన్ పూర్ గ్రామానికి చెందిన గిరిజన మహిళ రజిత, భర్త పోచయ్యతో కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. రాత్రి 8:30 నుండి 11:30 గంటల వరకుకేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించారు. ఈ విషయం తెలిసిన స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి మెడికల్ కాలేజ్ కు చెందిన ఆసుపత్రిని సందర్శించారు. గిరిజన మహిళకు అందుతున్న చికిత్స గురించి వాకాబు చేశారు. గిరిజన మహిళ పట్ల, తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కొరకు సెల్ఫోన్లో స%శీ%ప్రదించడానికి ప్రయత్నించారు. అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సైతం సెల్ఫోన్లో స%శీ%ప్రదించడానికి ప్రయత్నించగా ఇద్దరు కూడా అందుబాటులోకి రాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే నైనా నేను ఆసుపత్రికి వస్తే, వైద్యులు లేరని, అధికారులు సైతం అందుబాటులోకీ రాలేదని , ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన జిల్లాలో ఓ గిరిజన మహిళ వైద్యం కోసం వస్తే తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నదని మండిపడ్డారు. అధికారులు, గిరిజనుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని ఇటువంటి చర్యల పట్ల ఉపేక్షించేది లేదని అన్నారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు గిరిజన మహిళను తరలించడానికి అంబులెన్స్ లో డీజిల్ లేదనడం పట్ల ప్రభుత్వ వైఖరి ఏ విధంగా ఉన్నదో వారి వైఖరి ఏమిటో తేట తెల్లమవుతున్నదని ఎద్దేవా చేశారు. అంబులెన్స్ లో డీజిల్ వెయ్యడానికి డబ్బులు లేకపోవడం ఏమిటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన స్వంత డబ్బులతో డీజిల్ తెప్పించి , గిరిజన మహిళను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. కెసిఆర్ హయాంలోనే ఈ మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేశామని తెలిపారు. వెనుకబడిన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్యేశం,లక్ష్యంతోనే సి. హెచ్. సి. ఆసుపత్రి ను జి. జి. హెచ్. ఆసుపత్రిగా మార్చడం జరిగిందన్నారు. అయినా వైద్యుల పనితీరులో మాత్రం మార్పు



లేదని,వెనుకబడిన జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రాథమిక చికిత్స మాత్రమే చేస్తున్నారు. రోగులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయడం అలవాటుగా మారిందన్నారు. దీంతో గిరిజనులకు, పేద రోగులకు ఆర్థిక భారం అవుతున్నదని తెలిపారు. ఆస్పత్రిలో వైద్యులు సరిగా విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సామాన్యుల పట్ల కనీస మర్యాద లేకుండా ఆసుపత్రి సిబ్బంది ప్రవర్తిస్తున్నారని నా దృష్టికి వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఇదే విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ను విలేకరులు సెల్ఫోన్లో సంప్రదించగా మీరు విలేకరుల ఏ విధంగా తెలుస్తుందని, మీకు ఏమైనా వివరాలు కావాలంటే ఆసుపత్రికి వచ్చి తీసుకోవాలని దురుసుగా మాట్లాడారు. కనీసం ఆత్మహత్య ప్రయత్నం చేసిన గిరిజన మహిళ పేరును కూడా చెప్పడానికి నిరాకరించారు.సూపరింటెండెంట్ ప్రవర్తన పట్ల విలేకరులు విస్మయం కు గురయ్యారు.



# బౌలర్లు ఎవరైనా నాకు ఒక్కటే

## టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ



టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ సిక్స్‌లు బాదడంలో చాలా స్పెషల్. బుల్లెట్లలా దూసుకొస్తున్న బంతులను సైతం రోహిత్ స్టాండ్స్‌కు మళ్లించగలడు. ఇక బౌన్సర్‌ను అతడు కొట్టే పుల్ షాట్‌కు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అందుకే అతడికి హిట్‌మ్యాన్ అనే పేరుంది. అలా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన లిస్ట్‌లో రోహిత్ టాప్‌లో ఉన్నాడు. తాజాగా రోహిత్ ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఇందులో అతడికి ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. ఎవరి బౌలింగ్‌లో సిక్స్‌లు కొట్టేందుకు ఆసక్తి చూపిస్తారు? అని యాంకర్, రోహిత్ శర్మను ప్రశ్నించారు. దీనికి హిట్‌మ్యాన్ ఏ బౌలర్ పేరును చెప్తాడు? ఎలా స్పందిస్తాడో అని ఆసక్తిగా చూశారు. కానీ, రోహిత్ ఆన్సర్ అత్యంత ఆసక్తిగా ఉండడం విశేషం. మరి అతడు ఏమన్నాడంటే "నిజంగా చెబుతున్నా, నేను ప్రతీ బౌలర్ బౌలింగ్ లో హిట్టింగ్ ఆడడానికి ఇష్టపడతాను. ప్రత్యేకంగా ఫలానా బౌలర్ అని ఏమీ లేదు. క్రీజ్‌లో నా మైండ్?సెట్ ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. హిట్టింగ్ ఆడేందుకే ఇష్టపడతా ను. నా ముందు ఎవరు ఉన్నారు? ఎవరు బౌలింగ్ చేస్తున్నారు? అనేది నేను అస్సలు పట్టించుకోను. ప్రతి మ్యాచ్‌లో ప్రతి బౌలర్‌పైనా ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నిస్తాను" అని రోహిత్ రిప్లై ఇచ్చాడు. దీంతో ఆడిటోరియం అంత చప్పట్లతో మార్మోగిపోయింది. అలాగే మరో ఆసక్తికర ప్రశ్నకు కూడా రోహిత్ సమాధానమిచ్చాడు. 'టీమ్ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో మీరు సరదాగా, జోకులు వేసుకుని, నవ్వుకోవడానికి ఎవరి రూమ్‌కు వెళ్తారు?' అని అడిగారు. దీనికి రోహిత్ "ఈ విషయంలో ఒకే వ్యక్తి కాదు. నేను అందరితో కలిసిపోతాను. కానీ నవ్వుకునేందుకు మాత్రం శిఖర్ ధావన్ చాలా ఫన్నీగా ఉంటాడు" అని చెప్పాడు. దీంతో రోహిత్- ధావన్ బాండింగ్ బాగుందని హిట్‌మ్యాన్ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అయితే 2013 నుంచి వన్డే ఫార్మాట్?లో కొన్నేళ్లపాటు రోహిత్-ధావన్ ఓపెనింగ్ చేశారు. ఈ జోడీ జట్టుకు అనేక శుభారంభాలు ఇచ్చింది. రోహిత్ ఇప్పటివరకు ఇంటర్నేషనల్ కెరీర్‌లో 499 మ్యాచుల్లో 637 సిక్స్‌లు బాదాడు. టెస్టుల్లో 88, వన్డేల్లో 344, టీ20ల్లో 205 సిక్స్‌లు ఉన్నాయి. ఇక ఐపీఎల్?లో 302 సిక్స్‌లు ఉన్నాయి. ఇవి కాకుండా దేశవాళీలో గణాంకాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. ఇక అంతర్జాతీయంగా అత్యధిక సిక్స్‌లు బాదిన ప్లేయర్‌గా రోహిత్ టాప్‌లో ఉండగా, విండీస్ దిగ్గజం క్రిస్ గేల్ (553) రెండో స్థానంలో ఉన్నాడు. రోహిత్ శర్మ ప్రస్తుతం వన్డేల్లోనే ఆడుతున్నాడు. అయితే టీమ్ఇండియా తరఫున చివరిసారిగా మార్చిలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఆడాడు. అప్పట్నుంచి ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అతడు బరిలోకి దిగలేదు. ఇక అక్టోబర్?లో ఆస్ట్రేలియా పర్యటనకు రోహిత్ సిద్ధం అవుతున్నాడు. ఈ టూర్‌లో భారత్ మూడు మ్యాచ్?ల వన్డే సిరీస్ ఆడనుంది. ఇందులో హిట్‌మ్యాన్ బరిలో దిగే ఛాన్స్ ఉంది. అందుకే రోహిత్ ప్రస్తుతం ఫిట్?నెస్?పై దృష్టిపెట్టాడు.? ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 13న బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్?కు వెళ్లనున్నాడు. అక్కడ ఫిట్?నెస్ టెస్టులో పాల్గొననున్నట్లు జాతీయ మీడియా కథనాల్లో వెల్లడించింది.

# బీసీసీఐ అధ్యక్ష పదవికి రోజర్ బిన్నీ రాజీనామా



బీసీసీఐలో పెద్ద మార్పు జరిగింది. అధ్యక్షుడు రోజర్ బిన్నీ తన పదవికి రాజీనామా చేశారని వార్తలు వస్తున్నాయి. ఆయన స్థానంలో ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యే వరకు శుక్లా ఈ పదవిని నిర్వహించనున్నారు. రోజర్ బిన్నీ 2022లో సౌరవ్ గంగూలీ తర్వాత బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన జూలై 19న ఆయన 70 ఏళ్ల వసంతంలోకి అడుగుపెట్టారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం 70 ఏళ్లు దాటిన ఏ ఆఫీస్ బేరర్ అయినా.. ఈ పదవిలో కొనసాగలేరు. అందుకే బిన్నీ రాజీనామా చేసినట్లుగా సమాచారం. 65 ఏళ్ల రాజీవ్ శుక్లా 2020 నుంచి బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. సెప్టెంబర్‌లో జరిగే వార్షిక సమావేశంలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అప్పటి వరకు శుక్లా బీసీసీఐ పనులను చూస్తారు. రాష్ట్ర యూనిట్లు కలిసి కొత్త అధ్యక్షుడిని నిర్ణయిస్తాయి. ఇటీవల జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి శుక్లా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో భారత జట్టుకు కొత్త స్పాన్సర్‌ను ఎంపిక చేయడం గురించి చర్చించారు. డ్రీమ్ 11 ఇప్పటి వరకు స్పాన్సర్‌గా ఉండేది, కానీ ఇప్పుడు వారు తప్పుకున్నారు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. కానీ కొత్త స్పాన్సర్‌ను ఇంత తక్కువ సమయంలో కనుగొనడం కష్టమని అపెక్స్ కౌన్సిల్ చెప్పింది. టెండర్లు, చట్టపరమైన ప్రక్రియలు, సాంకేతిక అంశాలు పూర్తి చేయడానికి సమయం కావాలి. ఆసియా కప్ కోసం తాత్కాలిక స్పాన్సర్‌ను ఎంచుకోవడం లేదని.. 2027లో జరిగే వన్డే ప్రపంచకప్ వరకు రెండున్నర సంవత్సరాల పాటు భారత జట్టుకు స్పాన్సర్‌గా ఉండే సంస్థ కోసం చూస్తున్నట్లు తెలిపారు.

## డైమండ్ లీగ్ రన్నరప్‌గా

# నీరజ్ చోప్రా



భారత జావెలిన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా జూరిచ్ డైమండ్ లీగ్‌లో రన్నరప్‌గా నిలిచాడు. స్విట్జర్లాండ్‌లో జరిగిన డైమండ్ లీగ్‌లో జర్మనీ స్టార్ ప్లేయర్ జూలియన్ వెబర్ (91.51) విజేతగా అవతరించాడు. ఫైనల్స్‌లో 85.01 మీటర్ల దూరం జావలిన్‌ను విసిరిన నీరజ్, రెండో స్థానం కైవసం చేసుకున్నాడు. ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన, కెషోర్న్ వాల్‌కాట్ 84.95 మీటర్లతో మూడోస్థానంతో సరిపెట్టుకున్నాడు. వెబర్ తొలి ప్రయత్నంలో 91.37 మీటర్లు, రెండో ప్రయత్నంలో 91.51 మీటర్లు విసిరి ఆశ్చర్యపరిచాడు. అయితే తొలి ప్రయత్నంలో 84.35 మీటర్లు, రెండో ప్రయత్నంలో 82 మీటర్లు బల్లెం విసిరిన నీరజ్, తర్వాత 3 ప్రయత్నాల్లో ఫౌల్ అయ్యాడు. తన చివరి ప్రయత్నంలో 85.01 మీటర్లు విసిరి రెండో స్థానానికి చేరాడు. చివరి రౌండ్ వరకు రెండో స్థానంలో ఉన్న కెషోర్న్ వాల్‌కాట్ చివరి ప్రయత్నంలో 78.30 మీటర్లే విసరడంతో నీరజ్ రన్నరప్‌గా నిలిచాడు. ప్రస్తుతం వరల్డ్ ర్యాంకింగ్‌లో నంబర్ వన్‌గా ఉన్న నీరజ్ చోప్రా, 2022లో జరిగిన జూరిచ్ డైమండ్ లీగ్ ఫైనల్లో తొలిసారి విజేతగా అవతరించాడు. 2023, 2024లో జరిగిన ఫైనల్లో కూడా రెండో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్ తొలిసారి 90 మీటర్ల మార్క్‌ను అందుకున్నాడు. వరల్డ్ ర్యాంకింగ్‌లో మూడో స్థానంలో ఉన్న జూలియన్ వెబర్‌కు (91.51) ఇదే కెరీర్ బెస్ట్ ప్రదర్శన. అంతకుముందు అతడు అత్యుత్తమ ప్రదర్శన 91.06 మీటర్లుగా ఉంది. అయితే నీరజ్ చోప్రా మీడియాతో మాట్లాడారు. ఇది చెత్త ప్రదర్శనేం కాదని చెప్పాడు. కానీ ప్రపంచ ఛాంపియన్? షిప్?కు సమయం దగ్గర పడుతుందని కాబట్టి తాను ఇంకా బల్లెం దూరంగా విసరాలని అన్నాడు. చివరి ప్రయత్నంలో 85.01 మీటర్లు విసిరి రెండో స్థానానికి చేరుకున్నానని చెప్పాడు. కానీ జూలియన్ వెబర్ ఈరోజు చాలా దూరం విసిరినందుకు తాను చాలా సంతోషంగా ఉన్నానని పేర్కొన్నాడు. వెబర్ 91.51 మీటర్లు విసరడం నిజంగా మంచి ప్రదర్శన అని కొనియాడాడు. తాను ఇంకా కొంచెం శిక్షణ పొందాలని తెలిపారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల సందర్భంగా (సెప్టెంబర్ 13-21) టోక్యోలో ప్రతిదీ భిన్నంగా ఉంటుందని అన్నాడు. జూలియన్ వెబర్ తనకు మంచి స్నేహితుడు అని చెప్పాడు. అతడు బాగా రాణిస్తున్నప్పుడు, ఒకరినొకరు నెట్టుకున్నప్పుడు తాను ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటానని అన్నాడు. టోక్యోలో నన్ను ఉత్సాహపరిచేందుకు భారతదేశం నుంచి కొంతమంది స్నేహితులు వస్తారని తెలిపాడు. తనకు అక్కడ నివసించే కొంతమంది స్నేహితులు ఉన్నారని, ప్రధాన ఛాంపియన్‌షిప్‌లలో, గోల్డెన్ త్రోల కంటే చాలా ముఖ్యమైనదని చెప్పాడు. కాబట్టి పతకం గెలవడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పుకొచ్చాడు.




# పీవీ సింధు అద్భుత విజయం

## క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సింధు

బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్, మాజీ ఛాంపియన్ పీవీ సింధు దుమ్మురేపుతోంది. గత కొన్ని నెలలుగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడిన సింధు.. ప్రతిష్టాత్మక టోర్నీలో అద్వితీయమైన ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-19, 21-15 తేడాతో ప్రపంచ రెండో ర్యాంకర్, చైనా షట్లర్ వాంగ్ జియిపై విజయం సాధించింది. 48 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో పూర్తి ఆధిపత్యం చెలాయించిన సింధు వరుస గేమ్‌లను కైవసం చేసుకుంది. ఈ గెలుపుతో వాంగ్‌పై తన ముఖాముఖి రికార్డ్‌ను 3-2తో మెరుగుపరుచుకుంది. తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైనా.. సింధు తన అనుభవంతో గేమ్ పాయింట్ సాధించింది. శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు ప్రారంభమయ్యే క్వార్టర్ ఫైనల్లో ఇండోనేషియా ప్లేయర్ పుత్రి కుసుమవర్ధనితో సింధు తలపడనుంది. 38వ ర్యాంకర్ అయిన పుత్రి కుసమవర్దనితో 12వ ర్యాంకర్ పీవీ సింధు ఇప్పటి వరకు ఒకే ఒక్క మ్యాచ్ ఆడి గెలిచింది. గతేడాది జరిగిన ఉబెర్ కప్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో సింధు 21-15, 21-17 తేడాతో పుత్రి కుసుమ వర్ధానిపై విజయం సాధించింది. ఈ రికార్డ్ ప్రకారం సింధు సునాయసంగా సెమీఫైనల్ చేరడం ఖాయంగా కనిపిస్తోంది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో సింధుకు మెరుగైన రికార్డ్ ఉంది. 2019లో స్వర్ణ పతకం సాధించిన సింధు.. 2017, 2018 టోర్నీలో రజత పతకాలు అందుకుంది. 2013, 2014లో క్యాంస్య పతకాలు సాధించింది. ఈ సారి తిరిగి స్వర్ణం సాధించాలనే పట్టుదలతో ఉంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ 19-21, 21-15,21-17 తేడాతో చైనాకు చెందిన లియాంగ్, వాంగ్ జోడీని మట్టికరిపించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ ప్రపంచ ఐదో ర్యాంక్ జంటకు షాకిచ్చింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ పిల-తనీషా క్రాస్టో జోడీ ప్రపంచ ఐదో ర్యాంక్ జంటకు షాకిచ్చింది. ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం ధ్రువ్-పిల 19-21, 21-12, 21-15తో టాంగ్ చన్-యింగ్ సూట్(హాంకాంగ్) జంటపై గెలుపొందింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 8-21, 21-17, 21-23తో ఆండర్స్ ఆంథోన్సెన్(డెన్మార్క్) చేతిలో పరాజయం చవిచూశాడు.

# గతం గురించి నేను ఎప్పుడూ చింతించను

## నేను ఎవరినీ నిందించాలనుకోవడం లేదు

## భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ




భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి తరచుగా వార్తల్లో నిలుస్తున్నాడు. షమీ 2014లో హసిన్ జహాన్‌ను వివాహం చేసుకుని, నాలుగు సంవత్సరాలుగా విడివిడిగా జీవిస్తున్నారు. షమీతోపాటు అతని కుటుంబం శారీరకంగా, మానసికంగా హింసించారని హసిన్ జహాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. హసిన్ జహాన్ గృహ హింస, మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు కూడా చేసింది. షమీకి చాలా మంది మహిళలతో అక్రమ సంబంధాలు ఉన్నాయని కూడా ఆమె ఆరోపించింది. మహ్మద్ షమీ కూడా ఈ ఆరోపణలన్నింటినీ ఖండించారు. ఇటీవల షమీ హసిన్ జహాన్‌ను వివాహం చేసుకున్నందుకు చింతిస్తున్నట్లు సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. హసిన్ జహాన్ సోషల్ మీడియా పోస్టుల ద్వారా నిరంతరం మహమ్మద్ షమీని లక్ష్యంగా చేసుకుంటూ వస్తోంది. ఆమె సోషల్ మీడియా, న్యూస్ ఛానెళ్లలో షమీకి వ్యతిరేకంగా మాట్లాడుతోంది. ఈ నెల ప్రారంభంలో, జహాన్ షమీని 'ఉమెనైజర్' అని కూడా పిలిచింది. అతను తన స్నేహితురాళ్ల పిల్లలకు ప్రాధాన్యత ఇస్తాడని, వారికి ఖరీదైన బహుమతులు ఇస్తాడని, తన కుమార్తె ఐరాను పూర్తిగా విస్మరిస్తాడని ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో షమీ తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, గతంలో జీవించడం తనకు ఇష్టం లేదని అన్నారు. తన వివాహం గురించి తనకున్న విచారం గురించి అడిగినప్పుడు, షమీ, "అలా వదిలేయండి. గతం గురించి నేను ఎప్పుడూ చింతించను. పోయినది పోయింది. నేను ఎవరినీ నిందించాలనుకోవడం లేదు, నన్ను కూడా నిందించాలనుకుంటున్నాను. నా క్రికెట్ పై దృష్టి పెట్టాలనుకుంటున్నాను. నాకు ఈ వివాదాలు అవసరం లేదు" అని అన్నారు. షమీ ఒక్కడే కాదు, వైవాహిక జీవితం సమస్యలతో నిండిన మరికొందరు క్రికెటర్లు కూడా ఉన్నారు. భారత మాజీ బ్యాట్స్‌మన్ శిఖర్ ధావన్ కూడా తన భార్య ఆయేషా ముఖర్జీ నుంచి విడాకులు తీసుకున్నాడు. ఈ సంవత్సరం, భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ కూడా విడాకులు తీసుకున్నారు. ధావన్, చాహల్, హార్దిక్ పాండ్యా కూడా వారి భాగస్వాములతో వివాదాల్లో చిక్కుకున్నారు. ఈ క్రమంలో షమీ మాట్లాడుతూ 'దర్యాప్తు చేయడం మీ పని. మమ్మల్ని ఎందుకు ఉరితీయాలనుకుంటున్నారు? మరొక వైపు కూడా చూడండి. నేను క్రికెట్‌పై దృష్టి పెడతాను, వివాదాలపై కాదు' అంటూ సమాధానం ఇచ్చాడు. షమీ ఇటీవలే దులీప్ ట్రోఫీలో తూర్పు జోన్ తరపున ఆడుతూ పోటీ క్రికెట్‌లోకి తిరిగి వచ్చాడు. 34 ఏళ్ల అతను బెంగళూరులో నార్త్ జోన్‌తో జరిగిన మొదటి రోజున 17 ఓవర్లలో 55 పరుగులకు 1 వికెట్ తీసుకున్నాడు. షమీ చివరిసారిగా మే 2న ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2025 ఐపీఎల్ సీజన్ షమీకి మంచిది కాదు. అతను 9 మ్యాచ్‌ల్లో కేవలం 6 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా కప్‌నకు కూడా అతను జట్టులో ఎంపిక కాలేదు. మార్చిలో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత అతను జాతీయ జట్టు తరపున ఆడలేదు.




# అఖండ-2 విడుదల మరింత ఆలస్యం

విజయవంతమైన 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న 'అఖండ 2: తాండవం' విడుదల వాయిదా పడింది. నిర్మాణానంతర పనుల కోసం అదనపు సమయం కేటాయించాల్సి రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా నిర్మాణ సంస్థలు ఓ ప్రకటనలో తెలిపాయి. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న సినిమాని విడుదల చేయాలని ఇదివరకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, సినిమా స్థాయిని దృష్టిలో ఉంచుకుని మరింత నాణ్యమైన రీరికార్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్ హంగుల్ని జోడించడం కోసం సినిమా విడుదలని వాయిదా వేస్తున్నట్టు- నిర్మాణ వర్గాలు తెలిపాయి. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నాయి. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతిని పంచడం కోసం విజువల్స్ పరంగా, స్కేల్ పరంగా రాజీపడకుండా మా బృందం పనిచేస్తోంది. 'అఖండ'కి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు దీటు-గా చిత్రాన్ని మలచడంపై దృష్టి పెట్టామని నిర్మాణ వర్గాలు తెలిపాయి. యువ కథానాయకుడు ఆది పినిశెట్టి ఇందులో కీలక పాత్రని పోషిస్తున్నారు. సంగీతం తమన్ అందిస్తున్నారు.




# నాగ్ బర్త్‌డే స్పెషల్ మ్యాష్ అప్ విడుదల


టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలున్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మథుడు, కింగ్ అనగానే గుర్తొచ్చేది మాత్రం నాగార్జుననే. నటనలో శివ నుంచి మొదలు ఇక తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. 66 ఏళ్ల వయసులోనూ భిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ వరుస సినిమాలతో అలరిస్తున్నాడీ హీరో. శుక్రవారం అక్కినేని హీరో పుట్టినరోజు సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ఓ స్పెషల్ మ్యాష్‌అప్ వీడియోను విడుదల చేసింది. ఇప్పటి వరకూ ఆయన చేసిన సినిమాల్లోని కొన్ని పాత్రల ఫేమస్ డైలాగులతో చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'ఈ ఫీల్డ్‌లో కొత్తగా ట్రై చేయాలంటే నేనే' అంటూ నాగార్జున డైలాగ్ ఆకట్టుకుంటోంది. నాగ్ బర్త్ డే సందర్భంగా అయనకు సినీ రాజకీయ ప్రముఖులు,అభిమానులు విషెస్ తెలిపారు.

# చీరలో క్యూట్‌గా మెగాడాటర్



అందాల ముద్దుగుమ్మ నిహారిక గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ బ్యూటీ సొంతం. తాజాగా ఈ చిన్నది చీరలో తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడు హీరోయిన్ తన లక్కు పరీక్షించుకొని, ఇప్పుడు నిర్మాతకగా మారి సక్సెస్‌తో దూసుకెళ్తుంది. ఈ బ్యూటీ మొదట యాంకర్‌గా చేసింది. తర్వాత 'ఒక మనసు' సినిమాలో హీరోయిన్ గా చేసి, మంచి మార్కులు కొట్టేసింది. అయితే ఈ సినిమా తర్వాత నిహారిక మూవీస్ చేస్తుందని అందరూ ఊహించారు. కానీ ఎవరూ ఊహించని విధంగా, ఈ బ్యూటీ మూవీస్‌కు గుడ్ బై చెప్పి నిర్మాతగా మారింది. కమిటీ కుర్రాళ్లు సినిమాను నిర్మించి మొదటి ప్రయత్నంలోనే మంచి సక్సెస్ అందుకుంది. నిర్మాతగా మారి మొదటి సక్సెస్‌తో ఎంజాయ్ చేస్తుంది. ఇక ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ చీరలో సిగ్గు పడుతూ, పలు ఫొటోలకు ఫోజులిచ్చింది. అందులో ఈ అమ్మడు అందం, చూస్తే ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.





# జాన్వీ మూవీ సన్నీ సంస్కార్ కీ తులసి కుమారి

జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న చిత్రం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'. జాన్వీ లేటెస్ట్ చిత్రమిది. ఓ యువ జోడీ ప్రేమ ప్రయాణం నేపథ్యంలో శశాంక్ ఖైతాన్ తెరకెక్కిస్తున్నారు. దసర కానుకగా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్నట్లు- టీజర్ ఆధారంగా అర్థమవుతోంది.



# అభిమాని పట్ల చిరు ఆప్యాయత

## ఆదోని నుంచి సైకిల్‌పై వచ్చిన మహిళకు ఆదరణ

మహోన్నత వ్యక్తిత్వం, అపారమైన సేవాతత్వంతో కోట్లాది మందికి ఆదర్శంగా నిలుస్తున్న మెగాస్టార్ చిరంజీవి మ-రోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఆదోని పట్టణానికి చెందిన వీరాభిమాని రాజేశ్వరి, చిరంజీవిని ఒక్కసారి ప్రత్యక్షంగా కలవాలన్న ఆశతో సైకిల్‌పై హైదరాబాద్‌కి సాహసోపేతమైన యాత్ర ప్రారంభించారు. శారీరకంగా, మానసికంగా ఎన్నో కష్టాలు ఎదురైనా, చిరు మీద ఉన్న అపారమైన అభిమానమే ఆమెకు బలంగా నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి, ఆమెను స్వయంగా ఆహ్వానించి, తన అభిమానానికి అద్భుతమైన గుర్తుగా చీరని బహుకరించారు. అలానే తన పిల్లల చదువుకి సంబంధించిన బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. అయితే రాజేశ్వరి, తన పిల్లలతో కలిసి మెగాస్టార్‌ను కలిసిన సమయంలో చిరంజీవికి రాఖీ కట్టి, ఆయనను తన అన్నయ్యలా భావిస్తున్నట్టు- తెలిపారు. ఈ అనుబంధానికి స్పందించిన చిరు, ఆమెకు సాంప్రదాయబద్ధంగా చీరను బహుమతిగా ఇవ్వడం, ఆశీర్వాదాలు అందించడం జరిగింది. తన అభిమానిని భావోద్వేగంతో గుర్తించిన చిరంజీవి, రాజేశ్వరి పిల్లల విద్యా భారం తానే భరిస్తానని హామీ ఇచ్చారు. వారి భవిష్యత్తు వెలుగుల బాటలో సాగేలా చేయడమే తన బాధ్యతగా భావించారు. అభిమానులను కేవలం అభిమానులుగానే కాకుండా, తన కుటుంబ సభ్యుల్లా చూసుకునే చిరంజీవి గొప్ప మనసుకు ఇది మరో బలమైన ఉదాహరణగా నిలిచింది. ఈ సంఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నెటిజన్లు చిరంజీవి పెద్ద మనసును ప్రశంసిస్తూ, తెరపై నటన ఒక్కటే కాదు - నిజ జీవితంలోనూ ఆయన ఓ మహామనిషి అని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం చిరంజీవి విశ్వంభర సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో పాటు-, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'మన శంకర వరప్రసాద్' చిత్రంతో కూడా ప్రేక్షకులను ఆకట్టు-కునేందుకు సిద్ధంగా ఉన్నారు. రెండు సినిమాలూ జెట్ స్పీడ్‌తో షూటింగ్ దశలో ఉన్నట్టు- సమాచారం.




# డ్యూడ్ మూవీ నుంచి సాంగ్ విడుదల

'లవ్‌టు-డే'తో తెలుగు ప్రేక్షకులనూ ఆకట్టుకున్న తమిళ నటుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'డ్యూడ్'. టాలీవుడ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండడం విశేషం. మమితా బైజు హీరోయిన్. కీర్తిస్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపావళికి సినిమాని విడుదల చేయనున్నారు. ప్రచారంలో భాగంగా తొలి పాటను రిలీజ్ చేశారు. సానపాటి భరద్వాజ్ పాత్రుడు సాహిత్యం అందించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**